# అసమర్థుడు

గోపాలం బస్సు దిగాడు.

మెయిన్ రోడ్డుమీద నాలుగు ఫర్లాంగులు నడిచి ఓ సందులోకి తిరిగాడు.

ఆ సందులో అడుగు పెట్టగానే దూరంగా కన్పిస్తున్న కొబ్బరి చెట్టున్న డాబా యిల్లు చూడగానే అతని గుండెలు వుండ చుట్టుకున్నట్టు అయినాయి.

దీపావళి పండుగ కోసం, కొత్త అల్లుడి రాకకోసం వేచిచూస్తూ, తెల్లటి సున్నంతో, రంగులతో ముస్తాబు అయిన ఆ యిల్లు తనకోసం ఎదురుచూడటంలేదని అతనికి తెలుసు.

ఈ ప్రపంచంలో అన్నింటి కంటే అతను ద్వేషించేది ఆ యిల్లు ఒక్కటే! కానీ ఆ యింట్లోకే అడుగు పెట్టక తప్పడం లేదు.

ఆ సందు మొగదలకి తిరగగానే గోపాలం అంత రాత్మని పీక పిసికి నలిబలి చేయ సాగాడు.

ఈ ప్రపంచంలో తాత ముత్తాతలు సంపాయించి పడేసిన సంపద వెనకలేకుండా పుట్టడం మహా పాపం!

దానికితోడు, ఎలాగైనా సరే, వుచితానుచితాలు విస్మరించి, నీతినిజాయితీ మంటగలపి అయినాసరే ఏదోరకంగా డబ్బు సంపాయించగలిగే తెలివితేటలు లేకపోవటం యింకా శాపం!

గోపాలానికి యీ ప్రపంచంలో చాలామందిమీద కోపం వుంది!

అందులో మొట్టమొదటివాడు వేమన!

అతను వ్రాసిన నీతి సూత్రాలు నిజాలుచూడాలంటే చచ్చేటంత భయం. మధ్యతరగతి కుటుంబాలకి, గొర్రెతోక జీవితాలకి గోపాలం బ్రతుకు చక్కటి వుదాహరణ! అతనికి వుద్యోగం లేదు. భార్య, యిద్దరు పిల్లలు వున్నారు. చదువు అనేది వుంది. అది పుస్తకాలు చదువుకోటానికి, అప్పుడప్పుడు లోకాన్ని విమర్శించటానికి తప్ప ఇంకెందుకూ పనికిరాదు. అతనిలో అభిమానం, రోషం చాలా వున్నాయి. అవి అప్పుడప్పుడు అతన్ని యిబ్బందుల్లో యిరికించటానికి మినహా యింకెందుకూ పనికి రావు. తనకి అవి ఏమాత్రం పనికిరావు అని తెలిసికూడా గోపాలం వాటిని వదులుకోలేడు.

కొబ్బరి చెట్లతో, అందంగావున్న డాబా యిల్లు దగ్గర పడుతున్న కొద్దీ గోపాలం గుండెలు రెపరెపలాడ సాగాయి.

ఒకసారి మాసిన తన బట్టలవైపు, చేతిలోవున్న చిరుగు పట్టిన చారలసంచీ వైపు చూసుకున్నాడు.

తను ఆ యింట్లో అడుగు పెడితే కలిమి నాట్యం చేస్తున్న చోట లేమి వెళ్ళి బిక్క ముఖం వేసుకుని నిలబడి నట్టుగా వుంటుంది.

గోపాలం లాంటి మనుషులు పిలవకుండా ఎవరింటికీ వెళ్ళరు!

అందులో అత్తవారింటికి పండుగపూట అయితే అసలే వెళ్ళరు!

కానీ తప్పదు! గోపాలం గుండెలని చీల్చుకుంటూ నిట్టూర్పు వచ్చింది.

తనలాటి నిర్భాగ్యులు ఎన్నివేలమంది నిట్టూర్పులు యీ గాలిలో మిళితమై వున్నాయో!

ఆరునెలల క్రితం మామగారితో ఘర్షణపడి. ఆవేశంగా ఎర్రబడిన ముఖంతో యీ యింట్లోంచి గాలి దుమారంలా బైటకు వెళ్ళిపోయాడతను.

ఆరోజున వెళ్ళినవాడు, వెళ్ళినట్టే యిట్లా మళ్ళీ తిరిగి రావాల్సివస్తుందని జ్యోస్యం తెలియలేదు. తెలిసినట్టయితే అంత దూకుడుగా వెళ్ళేవాడు కాదు. ఒకవేళ వెళ్ళినా అమాయకురాలయిన శాంతకి అలాంటి వెధవ వాగ్దానాలు చేసేవాడు కాదు.

ఆరోజు కళ్ళ నీళ్ళతో, భయంతో రెపరెప లాడుతున్న చూపులతో తన దగ్గరగా వచ్చిన శాంతతో వుద్యోగం సంపాదించుకొని నెల రోజుల్లో తిరిగివస్తానని, యీ యింటి నుంచి శాశ్వతంగా తీసుకు వెళ్ళిపోతానని ఆవేశంతో ఏదో ఏదో అనేశాడు.

నెల రెండు నెలలుగా మారింది. మూడు నెలలు అయినాయి! ఆరున్నెల్లు గిర్రున తిరిగివచ్చాయి. వుద్యోగం అనేది గోపాలానికి ఎండమావిలాగానే మిగిలిపోయింది.

వుద్యోగం లేకపోతే పోయింది. ఒక్కసారి వచ్చి కళ్ళకి కనిపించమని ప్రాథేయపడుతూ శాంత వుత్తరాలు వ్రాసింది. గోపాలం ఆ వుత్తరాల్లో బాధ అర్థం చేసుకున్నా లక్ష్యపెట్టలేదు. వుద్యోగం లేకుండా యింటికి వెళితే యింకా అలుసు అయిపోతానేమోనని భయంతో దూరంగానే వుండి పోయాడు.

శాంత వుత్తరాలు వ్రాయడం మానేసింది.

తనలోవున్న అభిమానాన్ని, రోషాన్ని చంపటానికి, శాంత కోరిక మన్నించటానికి యింకా రెండు నెలలు పట్టింది. తన పిల్లలకోసం, భార్యకోసం అతను తప్పనిసరిగా మళ్ళీ యీ ఇంటికి రావాల్సివచ్చింది. కాళ్ళు అయిష్టంగా, ఆ యింటిని సమీపిస్తున్నకొద్దీ గోపాలం గుండెలు మోయ లేని భారం మోస్తున్నట్లుగా అయినాయి. మాసిన బట్టలతో, చేతిసంచితో సగం చచ్చి ఆ యింటి ఆవరణలో అడుగు పెట్టాడు గోపాలం.

వాకిట్లో ముందుగా బావమరిది ఎదురయ్యాడు. వాడికి పట్టుమని పది ఏళ్ళయినా లేవు. అయినా అప్పటికే అన్ని సంగతులూ తెలుసు. గోపాలం యిక్కడ వున్నప్పుడు వాడికి లెక్కలు చెబుతూ వుండేవాడు.

"అరె! పెద్దబావ వచ్చాడు! అమ్మా బావవచ్చాడే! అక్కా బావ వచ్చాడు! రాధా! మీ నాన్న వచ్చాడు!"

యింట్లోకి తూనిగలా పరుగెత్తిన వాడి కంఠం కంచుగంటలా మోగటం గోపాలానికి వినిపిస్తూనేవుంది.

శాంత లోపల మినపప్పు రుబ్బుతున్నట్టుంది!

ఆ చేత్తోటే బయటికి పరుగెత్తుకు వచ్చింది!

గోపాలం ఇంతసేపటినుంచీ పడుతున్న బాధ, అవమానం అన్నీ గుండెలమీద నుంచి దిగిపోయినాయి.

శాంత కళ్ళల్లో పట్టరాని ఆనందం చూడగానే అతనికి చాలా హాయిగా, అమృతం తిన్నంత మధురంగా అనిపించింది. ఆ ఒక్క క్షణంలో తన బాధలు తన సర్వస్వం మరిచిపోయాడు.

గోపాలం, శాంత ఇరువురూ చూపులతోనే ఒకరిని ఒకరు హత్తుకుపోయారు.

"లోపలకు రండి." కిందికి మెట్లు దిగివస్తూ అంది శాంత.

గోపాలం అపరాధిలా చూశాడు!

శాంత కళ్ళు రెపరెపలాడినాయి. వాటిల్లో క్షమాపణ యిట్టే చదివేయగలిగాడు అతను.

"రండి. లోపలికి" అంది బ్రతిమలాడుతున్నట్లుగా.

తడబడుతున్న గొంతుతో అన్నాడు.

"నేను - నేను వెళ్ళిపోవాలి శాంతా! ఒక్కసారి చూచివెళదామని వచ్చాను. పిల్లలేరి."

అంతలోకే రాధ పరుగెత్తుకు వచ్చింది.

"నాన్నా!"

గోపాలం ఒక్కసారి రాధని పైకి ఎత్తుకుని, గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు.

"నాన్నా! నువ్వు వస్తావని నాకు తెలుసు!" గర్వంగా-సంతోషంగా అంది.

"తెలుసా! ఎలా?" కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యంగా అడిగాడు.

"అమ్మ నాకు చెబుతోందిగా! రోజూ చెబుతుంది. నీకు రైలుకి టిక్కెట్టు దొరకగానే వచ్చేస్తావుట! ఈరోజు దొరికేలా చేయమని నేను దేవుడికి దండం పెట్టాను."

గోపాలం కూతురిని యింకాయింకా గట్టిగా హత్తుకున్నాడు.

తనకి యీ బ్రతుకు మీద యింకా ఎక్కడో కాస్త రుచి, మమకారం పట్టి ఎందుకు పీడిస్తున్నాయో అతనికి యిప్పుడు అర్థమైంది! దానికి జీవంపోస్తున్నది యీ లేత చేతులు, యీ లేత పెదవులే!

"తమ్ముడు ఏడమ్మా!" కొడుకు గుర్తుకు వచ్చి అడిగాడు.

"జ్వరం వస్తోంది నాన్నా!" అంది రాధ.

శాంత కళ్ళలో గిఱ్ఱున నీళ్ళు తిరిగాయి.

అక్కడనుంచి గబగబా వంటయింటివైపు వచ్చింది. జీడిపప్పు వేయిస్తున్న తల్లితో, "అమ్మా! ఆయన వచ్చారమ్మా! వాకిట్లోనుంచే వెళ్ళిపోతా నంటున్నారు. నువ్వు

వచ్చి ఒక్కసారి 'లోపలికి రండి' అని పిలువమ్మా! నువ్వు పిలిస్తే నీమాట కాదనలేరు."

అంది శాంత గబగబా

అంటూనే వీధి వాకిట్లోకి తొంగి చూసింది.

ఈకాస్తలో అతను మళ్ళీ వెళ్ళిపోతాడేమోనని భయం!

శాంత తల్లి మంగమ్మగారు కీళ్ళవాతంవున్న మనిషి, కూర్చుంటే ఓపట్టాన లేవలేదు.

ఎలాగో అతిప్రయత్నంమీద లేచి బైటికి వచ్చింది.

ఆవిడకి గోపాలాన్ని చూస్తే ఎప్పుడూ కాస్త అభిమానమే!

ఆవిడ మనసులో తనపట్ల గౌరవం, అభిమానం వున్నాయని గోపాలానికి తెలియదు.

"అదేమిటి బాబూ! అక్కడే నిలబడ్డావేం! లోపలికి రా!" అంది.

"ఫర్వాలేదులెండి" మొహమాటంగా అన్నాడు.

"శాంతా! ఆయనకి కాళ్లు కడుక్కునేందుకు నీళ్ళు యివ్వు" అని కేక పెట్టిందావిడ.

శాంత నీళ్ళకోసం లోపలికి పరుగెత్తింది.

గోపాలం కూతురిని యింకా ఎత్తుకునే వున్నాడు.

ఇంతలో వీధి వాకిట్లో టాక్సీవచ్చి ఆగింది.

గోపాలం తిరిగి చూశాడు.

టాక్సీలోనుంచి అతని మరదలు పద్మ, భర్త వామన రావూ దిగారు. వెంట మామగారు కూడా వున్నారు. ఆయన స్వయంగా వెళ్ళి వాళ్ళని తీసుకువచ్చినట్టున్నాడు.

వస్తూనే ఆయన కేకలు పెట్టాడు.

"ఎవరే అక్కడ! చప్పున కాళ్లు కడుక్కోటానికి నీళ్లు తీసుకురండి."

తండ్రి, చెల్లెలు, మరిది అనుకోకుండా హఠాత్తుగా రావడంతో క్షణంపాటు తొట్రుపడిన శాంత భర్తకని తెచ్చిన నీళ్ళనే వాళ్ళకి అందిచ్చేసింది.

గోపాలం కూతురిని ఎత్తుకుని, ఓ పక్కగా, వాళ్ళని చూడనట్టే నిలబడ్డాడు.

శారద కారులో నుంచి దిగగానే యింట్లోకి పరుగెత్తింది. వామనరావు అతన్ని చూశాడో లేదో, చూసి అతను పలకరించనపుడు నేనెందుకు పలకరించాలి అనుకున్నాడో మెదలకుండ చూడనట్టే లోపలికి వెళ్ళిపోయాడు.

మామగారు మాత్రం ఆగి పలకరించారు.

"ఎవరు! గోపాలమా! ఓహో!"

గోపాలం అయిష్టంగానే నమస్కరించాడు.

"ఏమోయ్! ఏమిటా అవతారం? అలా వున్నావేం?"

ఆయన సమాధానం కోసం చూడకుండానే లోపలికి వెళ్ళిపోయాడు.

గోపాలానికి తక్షణమే వెళ్ళిపోవాలనిపించింది.

కానీ ఎలాగో తమాయించుకున్నాడు.

"బాబుకి బాగా జ్వరంగా వుంది" అంది శాంత.

"లోపలికి పద శాంతా! నేను యీ యింటికి పిలవకుండా వచ్చిన అతిథిని! నాకు మర్యాద లేమిటీ! పద! బాబుని చూస్తాను" అన్నాడు.

శాంత కళ్ళలో భయం, అవమానం తొలగిపోయి ఆనందం మెరిసింది.

తండ్రి పలకరించకపోతే అంతెత్తున ఎగిరిపడి అటునుంచి అటే వెళ్ళిపోతాడేమోనని భయపడింది శాంత.

గోపాలం అలాటివేవీ చేయలేదు. లోపలికి వచ్చాడు.

కొడుకు పడుకున్న గదిలోకి వెళ్ళాలంటే సింహ ద్వారం నుంచి వీళ్ళందరి ముందూ లోపలికి వెళ్ళాల్సిన అవసరం లేదు. పక్క సందులోనుంచి ఆ గదిలోపలికి గుమ్మం వుంది. గోపాలం ఆ సందులో నుంచీ గదిలోకి వెళ్ళాడు. "మీకోసం ఒకటే కలవరింత" బాబు పడుకున్న మంచం దగ్గరగా వెళుతూ అంది శాంత.

గోపాలం రెండంగల్లో నడిచినట్టు చప్పున మంచందగ్గరకి వెళ్ళాడు. బాబు తల పక్కకుపెట్టి మాగన్నుగా పడుకుని వున్నాడు.

"నిన్నంతా అరుగో నాన్న వచ్చారు. అంటే రెండు మూడు సార్లు కళ్ళు తెరిచాడు. మీరు పిలవండి" అంది శాంత.

జ్వరంతో వడలిపోయినట్టున్న పిల్లాడిని చూడగానే గోపాలం గొంతులో ఏదో అడ్డుపడ్డట్టయింది.

దుప్పటి తీసి ఒళ్ళుతాకి చూశాడు జ్వరంతో ఒళ్ళు కాలిపోతోంది.

"ఎన్నాళ్ళ నుంచి జ్వరం?" అన్నాడు శాంతవైపు తిరుగుతూ.

"వారం రోజులనుంచీ, మరీ రెండు మూడు రోజుల నుంచి మూసిన కన్ను తెరవడం లేదు.

"మందు ?"

"యిప్పిస్తున్నాం. డాక్టర్. మీ మీదబెంగ అంటు న్నాడు. ఇంకో రెండు రోజులు మీరు రాకపోతే వీడు మనకు దక్కేవాడు కాదు" శాంతకి కళ్లలో గిఱ్ఱున నీళ్లు తిరిగాయి.

గోపాలం మంచంమీద కూర్చుని కొడుకుని చేతుల్లోకి తీసుకున్నాడు.

ఈ ప్రపంచంలో వున్న ప్రేమంతాపోసి రంగరిస్తు న్నట్టు పేరు పెట్టి పిల్చాడు.

బాబు కళ్లు కొద్దిగా తెరిచిన బడి మళ్ళీ మూసుక పోయాయి.

గోపాలం రెండోసారి పిల్చాడు. బాబు యీ సారి కళ్ళు తెరిచాడు. ఎర్రబడి పీక్కుపోయి మళ్లీ మూసుకు పోటానికి సిద్ధంగా వున్న ఆ కళ్లు క్షణం సేపు గోపాలం ముఖం మీద నిల్చాయి.

"బాబూ! నీకోసం బొమ్మలు తెచ్చాను. చూస్తావా?" అన్నాడు గోపాలం.

బాబు తలవూపాడు.

గోపాలం శాంతని సంచీ దగ్గరకి తీసుకు రమ్మన్నాడు.

అందులో నుంచి, యిదుగో - అంటూ అపురూపమైన దేదో తీస్తున్నట్టు చెబుతూ కాస్త పెద్దదిగా తెరచాపలలో వున్న పడవతీసాడు.

జ్వరంతో ఆరిపోయినట్టున్న బాబు పెదవుల మీద చిన్న చిరునవ్వు చిందింది.

దాన్ని చేత్తో పట్టుకున్నాడు.

"చెప్పు బాగుందా!" గోపాలం అడిగాడు.

బాబు బాగుంది అన్నట్టు తల వూపాడు.

రాధ కూడా దగ్గరకి వచ్చింది.

బాబు తల ఎత్తి తండ్రి ఛాతీ దగ్గరగా వచ్చాడు.

గోపాలం కొడుకుని గుండెలకి మృదువుగా అదముకున్నాడు.

కొడుకు లేతచేతులు విడదీయలేని బంధాల్లా తండ్రి మెడచుట్టు పడ్డాయి.

గోపాలం ఆప్యాయంగా వాడివీపు నిమిరాడు.

ఎంత అసమర్థుడుతను! వాడి జీవితావసరాలకి కావల్సినవి సమకూర్చలేకపోగా, వాళ్ళు ఎక్కడో అక్కడ యింత తిని నిశ్చింతగా పెరగకుండా యిదొకటి. పిల్లల్ని అసలు అంతగా తనదగ్గర అలవాటు చేసుకోవడం తనదే తప్పేమో తనలాటి వాళ్ళకు యిలా ముత్యాల్లాటి పిల్లలు పుట్టడం కూడా ఒక దురదృష్టమేనేమో!

"నేనిప్పుడే వస్తాను" అంటూ శాంత లోపలకు వెళ్ళింది.

రాధ తండ్రిప్రక్కనే కూర్చుని ఏవేవో చెప్పేస్తోంది. అది చిన్నప్పటి నుంచీ అంతే. వాగుడుపిట్ట! ఎక్కడేవి జరిగినా తుణ్ణంగా జ్ఞాపకం పెట్టుకుని వచ్చి తండ్రికి చెబితేగాని నిద్రపట్టదు.

కొడుకుని ఒళ్ళో పెట్టుకుని కూర్చున్న గోపాలం గదంతా కలియచూశాడు. గదిలో యిదివరకు తనువుండగా లేని సామాన్లు చాలా కన్పిస్తున్నాయి. ఓమూల బియ్యం

బస్తా దానిమీద విస్తళ్ళకట్టా ఉన్నాయి. యింకో పక్కన చింతపండు బుట్ట యింకేవో సంచీ ఉన్నాయి. పరధ్యాసగా గదిని కలియచూస్తున్న గోపాలం కూతురు జబ్బమీదపడి వూపి మరీ చెప్పటంతో యాంత్రికంగా రాధ వైపు తిరిగాడు.

"నాన్నా! మరే! నువ్వులేనప్పుడు అమ్మ ఎంత ఏడుస్తుందని! ఎప్పుడూ ఏడుపే నాన్నా! ఒకసారి 'ఎందుకు ఏడుస్తున్నావు' అనినేనంటే నన్ను కొట్టింది. వూరికే నన్ను - తమ్ముణ్ణి కొడుతుంది నాన్నా. ఒకసారి నేను 'నాన్ననిరానీ నిన్ను తన్నించకపోతేచూడు' అని బెదిరిస్తే అప్పుడేమో నవ్వింది. ఎందుకు నాన్నా అమ్మ ఎప్పుడూ ఏడుస్తుంది?" అమాయకంగా అడుగుతోంది రాధ.

గోపాలం కూతురితల పట్టి దగ్గరకు లాక్కున్నాడు. ఈ చిన్న పిల్లలకి ఎంత ఆసక్తి! ప్రతిచిన్న విషయం వివరంగా తెలుసుకోవాలని ఆరాట పడ్తారు.

శాంత తిరిగి వచ్చింది.

"నీళ్లు వేడిగావున్నాయి, స్నానం చేస్తారా?" అంది.

"వద్దు"

శాంత దగ్గరికివచ్చి కొడుకు ఒళ్ళుపట్టి చూసింది.

బాబు నిద్రపోవడంతో గోపాలం మంచంమీద పడుకోబెట్టాడు.

"అయ్యో నా మతిమరుపు మండిపోను, వుండండి కాఫీ గ్లాసులోపోసి మర్చిపోయి వచ్చాను" శాంత గబగబా లోపలికి వెళ్ళింది.

"శాంతా" గోపాలం వారిస్తున్నట్టు పిల్చాడు. కాని శాంత వినిపించుకోలేదు. వెళ్ళిపోయింది.

"నాకిప్పుడేం వద్దని మీ అమ్మకి చెప్పిరామ్మా" కూతురిని పంపాడు. రాధ మంచంమీద నుంచి క్రిందకి వురికి తూనీగలా లోపలికి పరిగెత్తింది. రాధ చెప్పిందో లేదో కానీ శాంత కాఫీ గ్లాసుతో భర్త దగ్గరికి వచ్చింది.

"నాకిప్పుడేం వద్దు శాంతా" అయిష్టంగా అన్నాడు.

"తీసుకోండి" ప్రాధేయతగా చూస్తూ గోపాలానికి అందించింది.

గోపాలం చేయిపట్టి ఆపేశాడు.

"శాంతా! నేను నిన్ను - పిల్లల్ని చూడటానికి వచ్చాను. నన్ను బాధపెట్టకు.

శాంత ముఖం చిన్నబోయింది.

"ఒక కప్పు కాఫీకేమైందండీ!"

"ఏమీకాదు శాంతా! ఎందులోనూ అసలు ఏమీ కాదు. అంతా మనం అనుకోవడంలో వుంది. ఒక్క నిముషం నువ్విలా కూర్చుంటే నేను నీతో కొద్దిసేపు మాట్లాడి వెళ్ళి పోతాను."

"వెళ్ళిపోతారా? యిప్పుడే?" విస్మయంగా చూసింది శాంత.

"వెళ్ళిపోవాలి శాంతా! నేనిక్కడ వుండటానికి రాలేదు."

"వెళ్ళిపోతారా? బాబుని యీ స్థితిలో చూసి! వాడికి తగ్గకముందు వెళ్ళిపోతారా?"

గోపాలం నిస్సహాయంగా చూడసాగాడు.

ఇంతలో లోపలినుంచి 'అమ్మాయి శాంతా!' అన్న తల్లి పిలుపు వినిపించింది. శాంత లోపలికి వెళ్ళిపోబోతూ, "నేను తిరిగి వచ్చేసరికి వెళ్ళిపోరు కదా మీరు?" అంది.

గోపాలం వెళ్ళనన్నట్టు తలూపాడు.

శాంత లోపలికెళ్లింది.

దాదాపు అరగంట తర్వాత-శాంత రాలేదు. కానీ బావమరిది వచ్చాడు.

వాడు గదిలోకి సాంతం అడుగు పెట్టకుండానే, గుమ్మంలో నుంచే తొంగిచూస్తూ "బావా! భోజనం వడ్డించారు. రమ్మంటున్నారు" అన్నాడు.

"యిప్పుడు తిననన్నానని చెప్పు" అన్నాడు గోపాలం. వాడు వెళ్ళిపోయాడు.

తర్వాత అతని కోసం ఎవరూ రాలేదు.

దాదాపు గంట తర్వాత శాంత వచ్చింది. పని గబగబా చేసినట్లు ముఖంలో అలసట కన్పిస్తోంది.

"రండి లేవండి." అంది.

"ఎందుకు?"

"స్నానం చేసి భోజనం చేద్దురుగాని."

"శాంతా! నాకు ఆకలిలేదు. అనవసరంగా నన్ను బాధ పెట్టి నువ్వు బాధపడద్దు."

"పండుగపూటా భోజనం మానేస్తే అమ్మా - నాన్నగారు వూరుకుంటారటండీ?"

"నేను తిని వచ్చానని చెప్పు."

శాంత నిస్సహాయంగా చూసింది.

"మీరు తినకుండా నేను తినగలనా? సరే పోన్లెండి. మీకంత బాధ అయితే అడగను. నేనూ మానేస్తాను."

"శాంతా!" గోపాలం యిబ్బందిలో పడ్డట్టుగా చూశాడు.

శాంత ఆయింట్లో వుదయంనుండి సాయంత్రం వరకూ వంచిన నడుం ఎత్తకుండా పనిచేస్తుందని గోపాలానికి తెలుసు.

శాంతకి ఆకలి ఎక్కువలని, ఒక్క క్షణంకూడా తాళ లేదని కూడా తెలుసు. శాంతకోసం తన అభిమానం చంపు కోవడమా? లేక తన అభిమానం కోసం శాంతని హింసించ డమా! అసలు యిక్కడికి రావటమే తను సగం చచ్చిపోయి వచ్చాడు. ఈ రావటానికి కూడా వెనకాముందూ ఆడినా, అందులో శాంతకోసం, పిల్లలకోసం తప్పనిసరిగా వచ్చాననే ఓదార్పువుంది. కాని అలాగే చెప్పుకొని భోజనం చేయడంలో ఆ ఓదార్పు వుంటుందా? వుండదు? అది కేవలం ఆత్మవంచన అవుతుంది.

శాంత ఆ సంభాషణ ముగియకుండానే యింతలో చప్పున ఏదో గుర్తుకు వచ్చినదానిలా బైటికి వెళ్ళింది.

అవతలనుండి మామగారు వస్తున్నాడు కాబోలు గది బైట మాటలు విన్పించాయి.

"ఏమమ్మా? ఏం? మీ ఆయన భోజనంచేయడా?" అంటున్నాడాయన.

"ఎందుకు చేయరు నాన్నా! బడలికగా వుందిట! తర్వాత చేస్తానన్నారు."

"ఎందుకో అంతబడలిక! ఉద్యోగం దొరికిందిటా?" ఆ కంఠంలో విరుపు, హేళన గోపాలం గుండెలకి సూటిగా వచ్చి తాకాయి.

"దొరికిందిట నాన్నా! నన్నూ-పిల్లల్నీ తీసుకెళ్ళటానికి వచ్చారు!"

శాంత స్వరం నిస్సంకోచంగా, దృఢంగా పలికింది.

గోపాలం వులిక్కిపడ్డాడు.

"ఏం వుద్యోగంట! నాలుగురోజులు వుండేదేనా!"

"తెలియదు."

"సరే, నేను పనుండి అలాబైటకి వెళ్తున్నాను. భోజనం చేయమను అతన్ని, పండుగపూటా యింట్లో అల్లుడిని పస్తుండబెట్టిన కర్కోటకుడు అని ఎవరైనా అనుకోగలరుమళ్ళీ."

ఆయన వెళ్ళిపోయిన ధ్వని వినిపించింది.

గోపాలం చెంపల్లోకి ఎరుపు పాకివచ్చింది.

మంచంమీదనుంచి లేచివెళ్ళి ఆయనకి సమాధానం చెప్పాలని పెనుగులాడ్తున్న శరీరాన్ని అదిమి పెట్టినట్టు అతని చేతులు మంచంమీద పట్టెని బిగించి పట్టుకున్నాయి. కొంత మందికి కొంత మందిని చూసినా, వారి కంఠధ్వని విన్నా నత్తగుల్లలో పురుగుల్లా ముడుచుకుపోతారు. గోపాలానికి మామగారిని చూసినా, ఆయన మాటవిన్నా అలాగే అవుతుంది ఎప్పుడూ. ఆయన స్వభావమే అంత! నోరు తెరిస్తే ఎదుటివారిని హీనపరిచేట్టో, నిరసన తెలిపేట్టో వాక్బాణాలు

రాలవల్సిందే! అందరి దగ్గర అంతే! అందులో వుద్యోగం లేని అల్లుడంటే మరీ జోరుగా వస్తాయి మాటలు. పెళ్ళయి ఐదారేళ్ళు కావస్తున్నా పట్టుమని, పదిరాళ్ళు తెచ్చుకోగల వుద్యోగం, నిలకడగా ఎక్కడా చేయలేని పెద్దల్లుడంటే ఆయనకి విసుగు. అది కేవలం గోపాలం అసమర్థత అని ఆయన అభిప్రాయం! ఈ ప్రపంచంలో మనిషి నిజంగా తన కాళ్ళ మీద తను నిలబడాలనే పట్టుదలేవుండాలికాని, సవాలక్ష మార్గాలున్నాయి అనుకుంటారాయన. కూతురిని, పిల్లల్ని తరచూ చూడడంతో గోపాలం బద్దకం సోమరితనం యింకా ఎక్కువైపోతోందని, యిక వీళ్ళు జీవితాంతం తన మెడలో గుదిబండలా వుంటారని ఆయన భయం. ఆయన కుటుంబం స్థితి అంతంత మాత్రం. అందులో యీ మధ్యనే యిల్లుకట్టుకున్నాడు. దానిమీద తీర్చవలసిన అప్పు చాలావుంది. చిన్నతనంలోనే మేనరికం సిద్ధంగా వుందని ఆయనకి పెళ్ళి చేసేసారు. వెంటవెంటనే పిల్లలు పుట్టారు. పుట్టిన నలుగురిలో యిద్దరు మగపిల్లలుపోయి, యిద్దరూ ఆడపిల్లలే మిగిలారు. ఆయనకి నడివయసు దాటిపోతోంది. యిప్పటివరకూ ఒంట్లో శక్తినంతా యీ పిల్లలకోసమే ఖర్చు చేసిన ఆయన, యిక సాధ్యమైనంత వరకూ యిది తగ్గించి కాస్త స్వసుఖం చూసుకోవాలనే ఆరాటం మొదలైంది. అందుకే వుద్యోగం లేని పెద్దల్లుడంటే ఆయనకి సానుభూతిలేదు. గోపాలం అంటే ఆయనకి చిరాకు కలగటానికి యింకో కారణం కూడావుంది. ఆయన వాళ్ళతో వీళ్ళతో చెప్పి ఎంతో శ్రమపడి యిప్పించిన వుద్యోగం గోపాలం నిలుపుకోలేకపోయాడు.

ఏదో విషయంలో మేనేజరు తొందరపడి మాట్లాడాడని, అతన్ని కొట్టి, ఆ వుద్యోగంలోనుంచి తీసివేయబడి యింటికి వచ్చాడు. కూడు గుడ్డకి అడ్డువచ్చే ఆత్మాభిమానాలు చూస్తే ఆయనకి మహామంట! తను కూతురిని యింట్లోంచి పంపేస్తేగానీ అల్లుడికి బాధ్యత తెలిసిరాదని ఆయన నమ్మకం.

ఈ అభిప్రాయం తరచూ మాటల సందర్భంలో శాంత ముందు బైట పెడ్తూనేవున్నాడు. శాంతకి యిటు తండ్రి స్వభావం, ధోరణీ తెలుసు. అటు భర్త యిబ్బందీ తెలుసు. మధ్యలో ఎవరినీ యేటూ అనలేక నలిగిపోయేది.

శాంత దృష్టిలో తండ్రి పద్ధతి, ఆయన అభిప్రాయం సమంజసమైనదే ఎప్పుడూ బ్రతకినంతకాలం ఈ పిల్లలకోసమే తాపత్రయమైతే వాళ్ళుమాత్రం సుఖపడేది ఎప్పుడు? ఆడ పిల్లకి పెళ్ళి చేసిన తర్వాత అంతటితో ఆసమస్య తీరిపోవాలి. వాళ్ళ జీవితాలు వాళ్ళు మలచుకొని, వాళ్ళ కష్టనిష్టూరాలు వాళ్ళు భరించాలి. పెళ్ళి కాకముందు ఒక్కతే బరువు అను కుంటే పెళ్ళయిం తర్వాత పిల్లలతో పుట్టింటికిచేరితే యింకా భారం కాదా వాళ్ళకి!

తండ్రి వెళ్ళిపోయిన తర్వాత అరగంటకి శాంత గోపాలం వున్న గదిలోకి వచ్చింది.

శాంత వచ్చే సరికి గోపాలం కటకటాలమధ్య పులిలా అటూయిటూ పచార్లు చేస్తున్నాడు.

శాంత గదిలో అడుగు పెట్టీ పెట్టగానే కోపంగా అడిగాడు.

"శాంతా! ఎందుకిలా చేసావు?"

అతని తీవ్రతకి శాంత క్షణం సేపు విస్తుపోయింది.

"ఏమని చెప్పాను," అంది విస్మయంగా.

"నాకు వుద్యోగం దొరికిందని. ఎందుకలా అబద్ధం ఆడావు ?"

"అదా! తప్పేముందండీ! ఈ ప్రపంచంలో ఎంతమంది అయినదానికి కానిదానికి అబద్ధాలు ఆడ్తారు. భర్త గౌరవం కాపాడటానికి అబద్ధం ఆడడం నేరంకాదు. దానివల్ల ఎవరికీ ఏ నష్టమూ లేదు."

"ఎవరికీ లేకపోవచ్చు కానీ నీకు చాలావుంది."

"నాకా !"

"అవును. నాకు ఉద్యోగం దొరికిందంటే నిన్ను తీసుకెళ్ళద్దూ ? నిన్ను తీసుకెళ్ళకుండా నేను వెళ్ళినప్పుడైనా యిది అబద్ధం అని వాళ్ళకి తెలియదూ ?"

శాంత ముఖం ఒక్క క్షణం పాలిపోయినట్టయింది.

అయినా నిబ్బరంగా అంది.

"అవును, నేనూ మీతో వస్తున్నాను అదెలాగూ జరిగేదే ?"

"శాంతా ?"

"పెళ్ళయింతర్వాత ఆడదానిస్థానం భర్త దగ్గరేనండీ! కనీసం నేను అలా అనుకుంటున్నాను."

"నాతో వస్తావా ? వస్తే - నువ్వూ పిల్లలూ ఏం తింటారు ?"

"యిప్పుడేం తింటున్నాం ?"

"అదేమిటి ?—"

"ఈ యింట్లో దేనికీ లోటులేని మాట వాస్తవమే! కానీ- నేను కడుపునిండా తింటున్నానని, కంటినిండా నిద్ర పోతున్నాననే మీరు అనుకుంటున్నారా ?"

నాకు తెలుసు శాంతా! ఆ మాత్రం గ్రహింపలేని మూర్ఖుడిని అంటావా ? నిన్ను నాతో తీసుకెళ్ళటం అంటే నాకిష్టంలేదా ? కానీ ఆ అవస్థలు నువ్వు పడలేవు శాంతా!"

"యీ సుఖం కంటే, ఆ అవస్థలే నాకు ఆనందం."

శాంత చేతులు ముందుకు చాచింది. "నిలవ నీడలేని నేను మిమ్మల్ని తీసుకెళ్ళి ఎక్కడ వుంచను - అని మీరు బాధ పడవద్దు. యివిగో! ప్రస్తుతానికి యీ గాజులు, గొలుసూ వున్నాయి. యివి అమ్మితే కొంత వస్తుంది. దాంతో చిన్నగది చూడండి. మనకి యింకే ఆధారం అయినా దొరికే వరకూ యింటి అద్దె మాత్రం కట్టేద్దాం. మీకు ఎక్కడా ఏదీ దొరక్కపోతే నా చేతిలో పని వుండనే వుంది."

గోపాలం ఏమిటన్నట్టు చూశాడు.

"మనకి ఆధారం దొరికే వరకూ నేనెక్కడైనా వంట చేస్తాను !"

"శాంతా !" వెన్నుపోటు తిన్న మనిషిలా చూశాడు గోపాలం.

"తప్పేమిటండీ! ఈ రోజుల్లో ఎందరు ఆడపిల్లలు, కుటుంబ జీవనోపాధికి ఎన్ని రకాలుగా కష్టపడటం లేదు ? ఎంతమంది తండ్రులు, అన్నలు ఆడపిల్లల జీతాలమీద ఆధార పడటంలేదు. మీరేమైనా బద్ధకస్తులా ? పనిచేయటానికి యిష్టపడని సోమరిపోతులా ? భార్యాభర్తలంటే ఏమిటి ?

ఒకరికి ఒకరు తోడూ-నీడా అనేగా! భర్తకి భార్య చేదోడుగా నిలబడడం నేరం అని ఎవరూ అనరే! యిక్కడ మాత్రం నేను వూరికే కూర్చుంటున్నానా? యింటి పనంతా చేయడం లేదూ? యిదే పని యింకెక్కడైనా చేస్తే మనకి హాయిగా గడుస్తుంది! ఒకళ్ళమీద ఆధారపడుతున్నాం అనే బాధ వుండనే వుండదు.”

గోపాలం ముఖం కప్పుకొని వెళ్ళి మంచం మీద కూర్చున్నాడు. అతని ఆంతర్యం చిత్రంగా శాంతవైపు తిరిగి అతనితో దెబ్బలాడుతోంది. శాంత చెప్పింది ఎంతో నిజం! భర్త దగ్గరగా వుండాలనే శాంత కోరిక సహజం! తను కాస్త అభిమానం వదులుకోవాలి.

శాంత గోపాలం దగ్గరగా వచ్చింది.

అతని మనసు అద్దంలో స్పష్టంగా చూసినట్టే అనిపించింది.

“నలుగురూ నవ్వుతారని మీ భయమా? అదేనా మీ సంకోచం?”

గోపాలం తుళ్ళిపడ్డట్టుగా తలెత్తి చూశాడు.

“కానివ్వండి. నవ్వనీండి! లోకుల కోసం పిల్లల్ని హింసించుకుంటారా మీరు? వాళ్లు మీకోసం ఎంత తపిస్తున్నారో నిజంగా అర్థంచేసుకుంటే మీరా నవ్వుని లక్ష్యపెట్టరు.”

గోపాలం తల వంచుకొన్నాడు.

ఆడవాళ్ళు ! చిత్రంగా ఎంత ఎదిగిపోతారు! అందులో కష్టాల్లో మరీ ! శాంత భర్త చేతిని తన చేతుల్లోకి తీసుకుంటూ అంది.

"యిలా మాట్లాడుతున్నానని నామీద కోపమా ?"

గోపాలం తలెత్తాడు !

"అవును. శాంతా కోపంగా వుంది కాస్త కూస్త కాదు. చాలా !" అతని కంఠంలో కోపం కంటే నిష్ఠూరమే ధ్వనించి శాంత కళ్లు రెపరెపలాడినాయి !

కళ్ళలో గిర్రున తిరుగబోతున్న నీళ్లు పెదవి బిగబట్టి అణచుకొంది. అయినా కళ్ళలో తడి వూరుతూనేవుంది.

గోపాలం శాంత చేతులు పట్టుకుని గుండెలకి నొక్కుకున్నాడు.

"ఎందుకో తెలుసా ? నీలాటి మంచి మనిషికి భర్తగా అయి, నేను యింకా అసమర్థుణ్ణి అవుతున్నాను."

శాంత చెయ్యి విడిపించుకొని చప్పున గోపాలం నోరు మూసేసింది. నిష్ఠూరంగా చూస్తూ అంది.

"ఏమిటండీ ఆమాటలు ! నాలుగురోజులు వుద్యోగం దొరక్క పోతే ఎందుకూ పనికి రానట్టేనా ! అసలు ఈ రోజుల్లో ఎవరికి వుద్యోగాలు దొరుకుతున్నాయి చెప్పండి. మన పక్కింటి తులసమ్మగారు తెలుసుగామీకు. ఆవిడ పెద్ద కూతురికి పదివేలు పోసి ఇంజనీరింగ్ పాసయిన అల్లుడిని తెచ్చారు. అతనికి ఉద్యోగం లేదుట ! పోనీ వూరికే వుంటాడా, భార్యని పుట్టింటినుండి డబ్బు తెమ్మనమని ఒకటే

వేధిస్తాట్ట! వుద్యోగం లేక పోతేనేం? దర్జాగాఉండట్లలేదూ. ఆవిడ మొన్న అమ్మదగ్గరకి వచ్చి ఒకటేగొడవ! ఒకరి కష్టం మీద సుఖాలు, దర్జాలు అనుభవించే యీ దరిద్రం ఎంత హాయి చెప్పండి. అవునా? లేదా!”

గోపాలం భార్య చెయ్యిపట్టి దగ్గరకు లాక్కున్నాడు. స్త్రీ శక్తిలోని గొప్పతనం యిదే! ఎలాటి అసమర్థులు, భీరువుల్లోనైనా సరే, సమర్థత, ధైర్యం నూరి పోస్తారు.

దాంతో మామూలు మనిషికి కూడా ఎక్కడలేని శక్తి వస్తుంది. అసాధ్యాలను, సాధ్యం చేసుకోగలమనే నమ్మకం కలుగుతుంది. ఈ మహా సృష్టిలో మగవాడికి తోడుగా, స్త్రీని ప్రసాదించిన భగవంతుడికి జోహార్లు అర్పించాలి!

శాంత అన్నది నిజమే! కలోగంజో తాగి ఒకచోట వుండాలి! కష్టమో, నిష్ఠూరమో కలిసి అనుభవించాలి.

పిరికితనంతో వెనక్కి తగ్గినకొద్దీ అసమర్థత క్రూర మృగంలా మీదమీదకి వస్తుంది. సాధ్యమైనంత వరకూ పళ్లబిగువున అయినాసరే దాన్ని ఎదుర్కోవాలి! కనీసం పెనుగులాటయినా జరిపితే జయాపజయాలు తర్వాత. జీవితం అంటే పిరికితనంతో, ఎప్పుడూ భయ సందేహాలతో వెన్నిచ్చి పారిపోయే మనిషి ఏదీ సాధించలేడు.

గోపాలం బాబుకు జ్వరం తగ్గగానే భార్యని - పిల్లల్ని తన వెంట తీసుకు వెళ్ళటానికి నిశ్చయించుకున్నాడు.

భార్యని పిల్లల్ని తీసుకొని మామగారి యింట్లోంచి బైటికి వస్తున్న గోపాలానికి బొత్తిగా యీతరానివాడు నడి సముద్రం వైపు నడిచివెళ్తున్నట్టుగా అనిపించింది. ఒక్క-

నిముషం శాంత పట్టిన మంకు పట్టుకి చికాకు కలిగింది. కష్టమో నిష్ఠూరమో హాయిగా ఒక నీడన వుండేదానికి యిలా కోరి కష్టాలని కౌగలించుకుంటా ననడం అతనికి చిరాకు కలిగింది. శాంతకి తనమీద భరోసా! ఆ భరోసా నిలుపుకోటానికి తను యాతన పడాలి!

గోపాలం భార్యని పిల్లల్ని వెంటపెట్టుకుని, సరాసరి స్నేహితుడు సూర్యం యింటికి వచ్చాడు. సూర్యం భార్య వూళ్లో లేదు, పుట్టింటికి వెళ్ళింది. ప్రస్తుతానికి ఆ యింట్లో తలదాచుకుంటే తర్వాత సంగతి చూసుకోవచ్చు.

సూర్యం స్థితిగతులు కూడా అంతంత మాత్రమే! చాలీచాలని జీతం! భార్య పురిటికి వెళ్ళింది, ఆ ఖర్చుకొంత! గోపాలం వచ్చి నాలుగు రోజులు మీ యింట్లో వుంటానంటే అతను బాధ పడలేదు. పైనుంచి సంతోషించాడు కూడా! మూడు నెలల వరకూ భార్య రాదని, యీ మూడు నెలలూ నిక్షేపంగా యిల్లు వాడుకోవచ్చునని చెప్పాడు. తను నెలకి 20 రోజులు కాంప్‌లో వుంటానని, వూళ్ళోవున్న వారం రోజులు ముందు గది కాస్త పడుకోటానికి యిస్తే చాలన్నాడు. గోపాలం, సూర్యం ఆతిథ్యానికి, అతను చూపుతున్న ఆదరణకి ఉబ్బి తబ్బిబ్బు లయ్యాడు.

రెండు గదులు, చిన్న వంట యిల్లు వున్న ఆ భాగానికి అద్దె 40 రూ!! ఈ మూడు నెల్లూ యిల్లంతా వాడుకుని ఆ అద్దె కట్టుకోమన్నాడు సూర్యం. అద్దె! 40 రూ! అనగానే గోపాలం మనసు తాటిపండు పడిన నక్కలా మూలిగింది.

సూర్యం గంటలో తన సామానంతా చకచకా రెండు పెద్ద చక్కపెట్టెల్లో సర్దేసి ఖాళీ యిల్లు గోపాలానికి అప్ప గించాడు. శాంత కోరికమీద ఒక స్టవ్, ఒక బకెట్ మాత్రం యివతల వదిలాడు.

సూర్యం వెళ్ళిపోయిన తర్వాత శాంత యిల్లంతా కలియచూసింది. "హాయిగా వుంది. వంటయింట్లో కుళాయి వుంది కూడా" అంది సంతృప్తిగా.

"అద్దె బాగాలేదూ 40 రూ! గోపాలం గొంతులో వెటకారం ధ్వనించింది.

సూర్యం తనకి ఆశ్రయం యిచ్చినట్టే యిచ్చి యింటి అద్దె బాధ వదిలించుకు పోయాడు!

బ్రతక నేర్చిన మనుష్యులు!

సూర్యం చేసింది సబబే అయినా ఆ యింట్లో అయా చితంగా తను వుండడం అసంభవమే అయినా గోపాలానికి ఎందుకో కోపంగా వుంది. తను దగాపడ్డాననే బాధ!

గోపాలం అద్దె బాగాలేదా అనగానే శాంత తృప్తి పడ్డట్టు అతని వైపుతిరిగింది. వెంటనే ఏదో గుర్తుకు వచ్చిన దానిలా మెళ్ళో గొలుసు తీసి అతని చేతిలో పెట్టింది.

గోపాలం క్షణంసేపు దానివైపుచూస్తూ నిల్చున్నాడు.

ఆలస్యం చేయకండి చప్పున వెళ్ళిరండి. పిల్లలు మళ్ళీ నిద్రపోగలరు."

గోపాలం రాయిలా అలాగే పదినిముషాలు నిల్చు న్నాడు.

శాంత మరోసారి హెచ్చరించటంతో అయిష్టంగా లేచివెళ్ళాడు.

అతని కళ్ళముందు చిన్నప్పుడు ఒకసారి బంధువుల్లో ఒకాయన భార్య గొలుసు తాకట్టు పెట్టినందుకు, పుట్టింటి వైపువారు చేసిన అల్లరి గుర్తుకు వచ్చింది.

రేపు శాంతకూడా మాటిమాటికి తనని దెప్పదు కదా! ఊహు! శాంత అలాటిది కాదు!

దాదాపు రెండు గంటల తర్వాత చేతి సంచిలో బియ్యం, కూరలు మొదలైన వాటితో తిరిగి వచ్చాడు అతను.

అతను వచ్చేసరికి శాంత ట్రంక్ పెట్టె తెరిచి అందులో సామానుతీసి అల్మారాలో సర్దుతోంది.

శాంత వచ్చేటప్పుడు పాతది ట్రంక్ పెట్టె ఒకటి తెస్తుంటే గోపాలం వద్దని వారించాడు.

"యిందులోని వన్నీ నావేలెండి" అంది.

గోపాలం ట్రంక్ పెట్టెలోనించి తీస్తున్న వస్తువులు చూశాడు.

ఒక కుంకుమ భరిణె! రెండు స్టీలు గ్లాసులు, రెండు గిన్నెలు, ఏవో పుస్తకాలు, బట్టలు వున్నాయి.

అతను మనస్ఫూర్తిగా కోరుకోక పోయినా, శాంత తల్లి, కూతురికి కాస్త వున్న సామాను తప్పకుండా యిచ్చి పంపుతుందని ఆశించాడు. కానీ ఆవిడ యివ్వలేదో, శాంత తిరస్కరించిందో తెలియదు, శాంత వెంట సామానేం

రాలేదు. ఈ రెండు స్టీలుగ్లాసులతో, ఒక్క స్టవ్‌తో సంసారం గడపడం ఎలాగో గోపాలానికి తెలియలేదు.

శాంత చిన్న గిన్నెతో అన్నం వండింది.

గోపాలం హోటల్‌కి వెళ్ళి కొంచెం కూరలూ, సాంబారూ, పెరుగూ తెచ్చాడు.

పిల్లలు సాంబారు, పెరుగుతో పూర్తిచేసుకొని లేచారు.

శాంత గిన్నెతో మళ్ళీ బియ్యం స్టవ్ మీద పడేసింది.

ఆ గిన్నె అన్నం చూస్తే చిన్నపిల్లలు అన్నాలాట ఆడినట్టుగా వుంది.

పిల్లలు నిద్రపోయారు.

నిద్రపోయే ముందు కూతురు "మనం మనింటికి ఎప్పుడు వెళుతామమ్మా" అని అడుగుతోంది.

"యిదే మన యిల్లు. మనం యిక్కడే వుంటాం" అంది శాంత.

"అమ్మమ్మా, తాతయ్యా దగ్గరికి మనం యిక వెళ్లమా ?"

"వాళ్లే మనల్ని చూడటానికి యిక్కడకు వస్తారు" శాంత ఎంతో అనునయంగా అంటోంది.

"మనం వెళ్ళినచోట బాగాలేకపోతే వచ్చేయమని అమ్మమ్మ నాకు చెప్పిందమ్మా!"

"సరే పడుకో" గోపాలం కూతురిని కసిరాడు.

భోజనాలయి పడుకోబోయేటప్పుడు జేబులో మనీపర్సు తీసి శాంత చేతిలో పెట్టాడు గోపాలం.

శాంత లెక్కపెట్టింది.

ఆశ్చర్యంగా తలెత్తుతూ "ఎంతకి అమ్మారు ?" అంది.

"మూడువందల యాభై"

"అయ్యో,500 కి తక్కువ రాదనుకున్నాను, మిమ్మల్ని వాడెవడో మోసం చేసాడండీ!"

గోపాలం తృళ్ళిపడ్డట్టుగ చూసాడు.

శాంత చిన్నబోయిన ముఖంతో అంది "కొత్తవాళ్లం వెళితే వాళ్ళుమరీ తక్కువకి అడుగుతారు. మీ రెవ్వరైనా తెలిసినవాళ్లని వెంట తీసుకువెళ్ళాల్సింది!"

గోపాలంకి గొలుసు అమ్మినప్పటి నుండి తను దగా పడ్డాననే శంక పీడిస్తూనేవుంది. ఆ శంకని శాంత ధృవపరిచింది. వెళ్ళేటప్పుడు మాటవరసకైనా శాంతని సుమారుగా ఎంతకి అమ్మవచ్చు అని అడగలేదు తను, అడిగినా బాగుండేది! అడిగి తెలుసుకెళితే యీ మొద్దవతారానికి యీ మాత్రం కూడా తెలియదనుకుంటే! తను మోసపోయి, నష్టపోయానన్న విషయంగోపాలనికి కష్టం వేసింది కోపంకూడా తెప్పించింది.

గొలుసు అమ్మగా వచ్చిన డబ్బుతో ముందు రెండు నెలలకీ సరిపడే అద్దె చెల్లించేశారు. మిగతా డబ్బుతో యింట్లో సంసారానికి కావాల్సిన అత్యంత ముఖ్యమైన సామానుకొన్నారు. ఇవిపోను చేతిలో మిగిలింది చాలా తక్కువ. ఆ చిల్లరనోట్లుచూస్తే గోపాలానికి గుండెల్లో రైళ్ళు పరుగెత్తినవి. ఇదివరకయితే తను ఒక్కడు తిన్నా తినకపోయినా ఎవరికీ తెలిసేదికాదు. ఇప్పుడు శాంత, పిల్లలు,

వాళ్ళు పస్తులుంటే చూసి తను భరించగలడా! ఆ స్థితి రాకూడదని దేవుడిని రోజూ ప్రార్థించేవాడు గోపాలం.

ఆ యింట్లో ప్రవేశించిన తర్వాత వారం పదిరోజులు ఆనందంగానే గడిచిపోయినాయి. ఉన్నంతలో వేళకి యింత తినేవాళ్లు. గోపాలం భార్యని, పిల్లల్ని సాయంత్రంవేళ పార్కుకి తీసుకువెళ్ళేవాడు. శాంత, గోపాలం పచ్చగడ్డిలో కూర్చునేవారు. దూరంగా [illegible] మంది పిల్లలు రకరకాల ఆటలు ఆడుతూంటే పిల్లల్ని అక్కడకువెళ్ళి ఆడుకోమని ప్రోత్సహించేవారు.

రాధ వెళ్ళి వాళ్ళతో కలిసి ఆడేది. బాబు మాత్రం నోట్లో వేలుపెట్టుకొని ఓపక్కగా నిలబడిపోయేవాడు. శాంతలోవున్న చురుకుదనం రాధకి వచ్చింది. తనలోవున్న సంకోచం, బెరుకుతనం బాబు అక్షరాలా పుణికి పుచ్చుకున్నట్టు కన్పించేవాడు.

పార్కుకి కొంతమంది పిల్లలు కార్లలో వచ్చేవాళ్ళు. వాళ్ళవెంట ఆయాలు వుండేవాళ్ళు. ఆ పిల్లలుకూడా యాపిల్ పండ్లలా మిస మిస లాడుతూ ఆరోగ్యంగా వుండే వాళ్ళు. గోపాలం అప్రయత్నంగానే తన పిల్లలవైపు చూసుకునేవాడు. దూరంగా అమాయకంగా నిలబడిన తన పిల్లల్ని చూస్తే గోపాలానికి గుండెలనిండా చిక్కటి చీకటి పేరుకుంటున్నట్టుగా అనిపించేది. తనకి మనిషిగా కనీస అవసరాలు కూడా తీర్చలేని యీ చదువుమీద, ఎలాటిరక్షణా కల్పించలేని యీ సంఘవ్యవస్థమీద, మామూలుమనిషి జీవితాల్లో మార్పులే తేలేని యీ ప్రభుత్వంమీద, ఆఖరికి తనని

పుట్టించి అప్రయోజకుడిగా చేసి ఆటలాడుతున్న భగవంతుడి మీద అంతులేని కోపం వచ్చేది.

విశ్రాంతి కోసం, సరదాకోసం వెళ్ళిన ఆ పరిసరాలు గోపాలానికి ఆ రకమైన ఆలోచన్లు రావడంవల్ల, విసుగ్గా అని పించేవి. లేచి భార్యని, పిల్లల్ని తీసుకుని యింటికి వచ్చేసే వాడు.

శా[illegible]కి యీ దిగులు, భయం ఏవీ లేనట్టుగా వుండేది. భవిష్యత్ ఒక నందనోద్యానవనం, మధురమైన స్వప్నం అన్నంత ధీమాగా, ఆనందంగా ఉంటోంది. ఇప్పటికి ఈ సమయం సుఖంగా గడిచిపోతే చాలు! రేపటి సంగతి రేపు చూసుకుందాం అన్న వేదాంతం శాంత ధోరణిగా కన్పించేది. నా యిల్లు, నా సంసారం అని ఆ ప్రత్యేకతకే తృప్తి పడుతున్న శాంతని యీ దారిద్ర్యం బాధిస్తున్నట్లు లేదు. ఆ అమాయకు రాలి అల్ప సంతోషానికి గోపాలం మనసు ఆర్ద్రమయేది.

శాంత వారం రోజుల్లో యిరుగూ, పొరుగుతో పరి చయం చేసుకుంది. ఎదురింటావిడని పిన్నిగారని, పక్కింటావి డని వదినగారని, వరసలుకూడా కలిపేసింది. పిల్లలుకూడా చనువుగా ఆ యిళ్ళకి వెళ్తుండేవాళ్ళు.

గోపాలం వుద్యోగంకోసం చెప్పులు అరిగేట్టు తిరిగాడు. కానీ ఫలితం ఎక్కడకెళ్ళినా శూన్యంగానే వుండేది.

యింటికి రాగానే ఎంతో ఆత్రంగా ఏమైంది అంటూ ఎదురొచ్చే భార్యకి కాలేదు అని చెప్పటానికి గోపాలానికి ప్రాణాంతకమైనట్టుగా వుండేది.

ఇంట్లోకి తెచ్చిన సామాను అయిపోవస్తుంది. గోపాలం, శాంత ఒక పూటేతినటం ప్రారంభించారు. తాతగారి యింట్లో సుఖానికి అలవాటుపడ్డ పిల్లలు సాయంత్రం వేళ టిఫిన్ కావాలనీ, రాత్రివేళ తాగటానికి పాలులేవని మారాంచేసే వాళ్లు. ఒక్కోసారి రాధకి నచ్చచెప్పాలని చూసి అపజయం పొందిన శాంత చివరకి రెండు వేసేది, రాధ పెద్దగా ఏడుపు లంఘించుకునేది. గోపాలం దగ్గరికి తీసుకొని, కథలుచెప్పి, కబుర్లుచెప్పి ఎలాగో మరిపించేవాడు. గోపాలానికి ఆ ఒక్కపూట అన్నం తినాలన్నా బాధగా వుండేది. శాంత అంటే యింట్లో పనంతా చేస్తుంది! తనేం పాటుపడ్తున్నాడని? ప్రతిపూట ఏదో ఒక సాకు చెప్పి ఆకలిలేదని తప్పించుకోబోయేవాడు. కానీ శాంత వూరుకునేది కాదు. అతనులేచి భోజనానికి కూర్చునే వరకూ తనూ తినేది కాదు. శాంత హఠానికి అతనికి కోపం వచ్చేది. కానీ తిన్న తర్వాత అతని కోపం చిత్రంగా మాయమయ్యేది. ఆకలితోనున్న మనిషికి అకారణంగా కోపం వస్తుందని గోపాలానికి అనుభవ పూర్వకంగా తెలిసింది.

యింట్లో సామాన్లు పూర్తిగా అయిపోయినాయి. యింకో రెండు రోజులుపోతే పిల్లల భోజనానికి కూడా దిక్కులు చూడాల్సిన స్థితి వస్తుంది. గోపాలం తిరిగినవాడు తిరిగినట్టే తిరుగుతున్నాడు.

ఆరోజు - గోపాలం వుదయం అనగా యింట్లోంచి పారిపోయి రాత్రికి తిరిగి వచ్చాడు. యింట్లో వుంటే శాంత భోజనం చేయమని ప్రాణాలు తీస్తుందని భయం.

గోపాలం తిరిగి తిరిగి నీరసంగా యింటికి వచ్చాడు.

శాంత అతనికి కాఫీ కలిపి యిచ్చింది.

శాంత అతన్ని భోజనానికి లేవమని బలవంతం చేయలేదు. గోపాలానికి అర్థమైంది.

మర్నాడు మధ్యాహ్నం.

పిల్లలు యింట్లో లేరు. పక్కింటి పిల్లలతో ఆడుకోటానికి వెళ్ళారు. గోపాలం యింట్లోనే వున్నాడు. నిన్నంతా తిరగటంతో అతనికి నీరసంగా వుంది. శాంతకూడా భోజనం చేయలేదు. శాంత భోజనంచేయనందుకు గోపాలానికి, గోపాలానికి అన్నం పెట్టనందుకు శాంతకి ఇద్దరికీ లోలోపల బాధగా వుంది.

కొంచెం అటుయిటు తారట్లాడినట్టు తిరిగింది శాంత. రెండు మూడు సార్లు గోపాలం దగ్గరగా వచ్చి మళ్ళీ వెళ్ళిపోయింది. శాంత ధోరణిచూస్తే గోపాలాన్ని ఏదో అడగటానికి నిశ్చయించుకుని, మళ్ళీ అడగలేక అవతలకి వెళ్ళిపోతున్నట్టుగా వుంది.

యిది పసిగట్టిన గోపాలం భార్యని దగ్గరికి పిల్చాడు. "ఏమిటి? ఏమైనా నాతో చెప్పాలనుకుంటున్నావా?" అని అడిగాడు.

శాంత అతని కెదురుగా వచ్చి నిలబడింది.

"అవును మిమ్మల్ని ఒకటి అడగాలనుకుంటున్నాను" మెల్లగా అంది.

గోపాలం క్షణంసేపు ఆలోచించాడు. శాంత అడగబోయేదేమిటో వూహించటానికి ప్రయత్నించాడు. "నాన్నగారి దగ్గరికి వెళ్ళిపోతాను, పిల్లలతో పడలేకుండావున్నాను" అనంటుందనుకున్నాడు.

"ఏమిటో చెప్పు" అన్నాడు.

శాంత అతని వైపు చూసి ఆగిపోయింది.

"చెప్పు" ధైర్యం యిస్తున్నట్టుగా మృదువుగా అడిగాడు.

మీారేమీా అనుకోనని మాటయిస్తే"

యిది ముందరకాళ్ళకి బంధం! అయినా అతను సహించాడు. ఏమీా అనుకోనన్నట్టు తలవూపాడు.

"పక్కవీధిలో తహసీల్దార్ గారికి వంటమనిషి కావాలట, ఆవిడగర్భిణితో వుందిట జీతం ఎక్కువేట" మన పక్కింటి వదినగారు చెప్పారు.

గోపాలం తృళ్ళిపడ్డట్లు చూశాడు.

శాంత అడుగబోయేది యిది అయి వుంటుందని అతను కలలో కూడా వూహించలేదు.

ముఖంలో వేగంగా వచ్చిన మార్పు చూసి జంకుతున్నట్టుగా అంది శాంత.

"ప్రస్తుతానికి యిది చేస్తుంటే—మీా కేదయినా దొరికితే మానేస్తాను."

శాంత యింకో రెండు నిముషాలు అక్కడే నిలబడింది.

భార్యకి తన కళ్ళలోని భావం కన్పించడం యిష్టంలేనివాడిలా గోపాలం పుస్తకంలోకి తల దించుకున్నాడు.

కొద్దిసేపు అక్కడ నిలబడిన శాంత చెప్పవలసినది అయిపోయినట్టు అక్కడనుంచి వెళ్ళిపోయింది.

గోపాలం గుండెల్లో మంటలాటిది బైలుదేరింది.

అక్కడ కూర్చుంటే పిచ్చెక్కుతుందేమో నన్నంత ఆవేశం వచ్చింది. అసలు యిలాటి ఆలోచన సలహాగా ఇచ్చి నందుకు పక్కింటి వదినగారిని రెండు దవడలూ వాయించా లన్నంత ఆగ్రహం వచ్చింది.

వెంటనే లేచి బట్టలు మార్చుకుని బైటకి వచ్చేశాడు.

గుండెల్లో ఎంత ప్రయత్నించినా ఆర్పశక్యంగాని మంట మండుతూనే వుంది.

శాంత వంటచేస్తుందీ! తనుండగా! ఛి, ఛీ! శాంతకి బుద్ధిలేదు.

పార్కుకివచ్చి కూర్చున్నాడతను. ఆలోచనల వేగానికి కంపిస్తున్న వాడిలా పచ్చగడ్డిలో బోర్లాపడుకొని మోచేయి దగ్గర ముఖం దాచుకున్నాడు. ఏడుపు వచ్చినంత పనైంది. శాంత పరాయి యిళ్ళల్లో వంటమనిషిగా చేయడం చూసే కంటే తను చావడం నయం అనిపిస్తోంది.

దాదాపు గంట తర్వాత-

చీకటి పడింది. పార్కులో దీపాలు వెలిగాయి. గోపాలం పచ్చగడ్డిలో వెల్లికిలా పడుకున్నాడు. అతనికి ఆవే శపు పొంగు చల్లారింది. ఆగ్రహం తగ్గింది. రోషాన్ని వివేకం జయించసాగింది. ఏం! శాంత అవసరానికి వంటచేస్తే తప్పే ముంది? ఈ అతిశయాలు, ఆడంబరాలు యీ దేశంలో కాని, విదేశాల్లో లేనేలేవు. నిజంగా ఆలోచిస్తే కష్టపడి బ్రతకడం కంటే గౌరవమైన పని యింకేంవుంది. తనకి ఉద్యోగం యిప్పట్లో దొరుకుతుందనే ఆశలేదు. అంతవరకూ శాంత, పిల్లలు పస్తులు పడుకోవాలా? తనలాటి అసమర్థుడు తాలికటి

నంత మాత్రాన శాంతకి స్వయంగా కష్టపడి బ్రతికే హక్కు లేదా! శాంత భర్తగా అన్ని సుఖాలుచూసి, అన్ని సౌఖ్యాలు తను గడిపితే సరే! అది లేనపుడు ఆమె మార్గానికి తనెందుకు అడ్డువెళ్ళాలి! యిది 'అమ్మపెట్టదు, అడుక్కుతిననివ్వదు' అన్న సామెతలావుంది.

పిల్లలిప్పటికే చిరాకు పడ్తున్నారు. అమ్మమ్మ దగ్గరకి వెళ్ళిపోదాం రమ్మనమని శాంత ప్రాణాలు తీస్తున్నారు! జీవితంలో ఎటుచూసినా చీకటే! తన అభిమానానికి, రోషానికీ శాంత, పిల్లలు బలికాకూడదు శాంత చాలా ఓర్పుగలది. యింత యిబ్బంది పడుతున్నా పన్నెత్తి ఒక్కమాట అనదు. ఈ విధంగా బలవంతంగా బైలుదేరి వచ్చి తన మెడకి గుదిబండ అయ్యానేమోనని బాధపడుతుంది. తనకి సాధ్యమైనంత వరకూ శాంతకు ఎలాటిబాధా కలగనివ్వకూడదు.

గోపాలం లేచి కూర్చున్నాడు.

అతని గుండెలని చీల్చుతున్నట్టుగా నిట్టూర్పు వచ్చింది.

జీవితం నుంచి ఏం కోరాడు తను! ఒక్క రెండుమూడు వందలరూపాయలు! తను ఐశ్వర్యం కోరలేదు. అధికారం కోరలేదు! డాబు - దర్జా కోరలేదు. భార్యకి పిల్లలకి వేళకి యింత తినటానికి అన్నం' వుండటానికి యింత నీడ! యివే గగనం అయిపోయాయి.

గోపాలం యింటికి వచ్చేసరికి పొద్దుపోయింది.

పిల్లలు నిద్రపోయారు. శాంత మేలుకుని కూర్చుని వుంది.

గోపాలం కాళ్ళుచేతులు కడుక్కుని వచ్చాడు.

శాంత కళ్ళు వాచి వున్నాయి. చెంపలమీద కన్నీటి చారికలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

"శాంతా!" అప్రయత్నంగా పిల్చాడు.

"నేను-నేను మిమ్మల్ని బాధపెట్టానా! క్షమించండి" డగ్గుత్తికతో అంది.

గోపాలం వచ్చి శాంత పక్కగా కూర్చున్నాడు.

"బాధా! నన్నా! నాకు బాధపడే హక్కు కూడా వుందా శాంతా! నిన్నింత బాధ పెట్టినందుకు నాకు సిగ్గని పిస్తోంది."

"నేను - నేను మీకిష్టంలేందే ఏపనీచేయను."

"అలాటి మాటలే అనద్దు నీకిష్టమైన పని నాక్కూడా యిష్టమే! యిక నుంచి దేనికీ నన్ను అడగవద్దు."

శాంత విచిత్రంగా తలెత్తి అతని వైపు చూసింది.

శాంత వూహించినట్టు గోపాలం కళ్ళలో వ్యంగ్యం కాని, నిరసనకాని, బాధకానీ కన్పించలేదు. బలవంతంగా కూడతీసుకున్న సహనంలాంటిది కన్పించింది.

తహసిల్దార్ గారి యింట్లో వంట చేయడం మొదలు పెట్టింది. రోజులు వేగంగా గడిచిపోతున్నాయి. ఉదయం గోపాలంకంటే ముందుగా లేచిన శాంత 8 గం. కల్లా యింట్లో పనంతా ముగించుకుని వెళ్ళిపోయేది. తిరిగి 1 గం. యింటికి వచ్చేది. మళ్ళీ 3 గం.కి వెళ్ళి రాత్రి 7-8 మధ్య తిరిగి వచ్చేది. ఈ లోపల పిల్లలకి కావల్సిన అవసరాలు గోపాలం చూసేవాడు.

శాంత ఆయింటావిడని ముందే జీతం అడిగి తీసుకోన టంతో అనుకున్నంత యిబ్బంది పడలేదు. శాంత అడ్వాన్స్‌గా అడిగి తెచ్చిన డబ్బుతో చేసిన వంట తినాలంటే గోపాలానికి ఎలాగో వుండేది. నోట్లోకి అన్నం వెళ్ళేదేకాదు. చాలాసార్లు కేవలం శాంత తృప్తి కోసం ఎంగిలి పడి లేచినా, అతనికి పస్తులున్నట్టుగానే వుండేది.

గోపాలం యీ మధ్య బైట తిరగటంకూడా తగ్గించు కున్నాడు. కాలినడకని తిరిగే ఓపికలేదు. బస్సుమీద పోవా లంటే ఛార్జీలు వేస్ట్ అనిపించేది.

సంసారం కోసం శాంత తనకు తోచినట్టుగా శ్రమ పడుతున్నా, పిల్లలకోసం, శాంతకోసం, గోపాలం బలవం తంగా అభిమానం చంపుకుని, సర్దుకుపోతున్నా, యిరుగూ - పొరుగూకి మాత్రం యీ సంసారం చూస్తే హేళనగా, నిర సనగా వుండేది.

భార్య కష్టపడి చాకిరీ చేస్తుంటే తిని కూర్చుంటున్న మగమహారాజు అన్నట్లు చూసేవాళ్లు. వాళ్లు అనుకుంటున్నారో లేదో ఆ దేవుడికే తెలియాలి. కానీ వాళ్లు తప్పకుండా అలా అనుకుంటున్నారని గోపాలం నమ్మేవాడు. దానితో అతనికి చీమలూ, జెర్రులూ పాకినట్టు వుండేది. దానికితోడు గోపాలం వాళ్లున్న యింట్లో గదిలో కూర్చుంటే ఎదురుగా చిన్న అందమైన మేడవుండేది. అందులో అతను ఏదో ప్రయివేట్ కంపెనీలో జాబ్ చేస్తున్నాడు. భార్యా, భర్త, ఒకే ఒకపిల్ల. ఆ పిల్ల ఎడ్వర్టయిజ్‌మెంట్ బేబీలా బాబ్ చేసిన జుట్టుతో ఆరోగ్యంగా, ముద్దుగా, బొద్దుగా వుండేది. వాళ్లని చూస్తుంటే

[stamp]

ఈ ప్రపంచంలో ఐశ్వర్యం, ఆనందం కొందరికిమాత్రమే పరిమితం సుమా అనిపిస్తుంది,

చాలాసార్లు గోపాలం పార్కునుంచో, బజారునుంచో, శాంతనూ పిల్లల్నీ తీసుకువస్తుంటే ఆ చిన్నపిల్లని తీసుకుని, కారులో వెళుతూ వాళ్ళు ఎదురయేవారు.

గోపాలానికి గుండెల్లో ఒక్కక్షణం ఈర్ష్య లాటిదేదో భగ్గుమనేది. అది పూర్తిగా యీర్ష్యకూడా కాదు. ఆకలితో దహించుకుపోతున్న వాళ్ళకి ఎదురుగా యింకోరు పంచభక్ష్య పరమాన్నాలతో కడుపునిండా తింటుంటే పడేవేదన అది.

కారు గోపాలాన్ని దాటిపోతుంటే అతను అప్రయత్నంగా గోపాలాన్ని చూసేవాడు. గోపాలానికి ఆ చూపులు గుచ్చుకుంటున్నట్టుగా అనిపించేవి. అసలెవరైనా తన వైపు చూస్తే గోపాలానికి ఎక్కడలేని చిరాకూ వస్తుంది.

శాంత వంట చేయటానికి వెళ్ళడంతో గోపాలం యింట్లో వుండేవాడు. ఆ రోజు తహసిల్దార్ గారి యింటికి బంధువులు వచ్చారుట. శాంత వుదయం లేస్తూనే వెళ్ళింది. గోపాలం తనే అన్నం వండి పిల్లలకి పెట్టాడు. శాంతకి బాగా జలుబుచేసింది. రాత్రికూడా సరిగ్గా నిద్రపోలేదు. దగ్గుతూ, తుమ్ముతూ మాటి మాటికీ లేస్తూనేవుంది. ఈ పూటకి వెళ్ళ వద్దని వారించాలనుకున్నాడు. కానీ బంధువులు వచ్చారని శాంత రోజూ కంటెముందు వెళ్ళింది. 12 గం.కి వచ్చిన శాంత పిల్లలు అన్నం తిన్నారని గోపాలం చెప్పగానే

నిట్టూర్పు విడిచింది. ఆ కళ్లలో కదులాడిన కృతజ్ఞత అతను గమనించక పోలేదు.

శాంత పదినిముషాలు వుండి హడావుడిగా వెళ్ళి పోయింది. మళ్ళీ 3 గం.కి వచ్చింది. ఎప్పుడూ లేంది యింటి తలుపులు లోపలవేసి వున్నాయి. శాంత తలుపు తట్టింది. ఈ వేళప్పుడు నిద్రబోయే అలవాటు గోపాలానికి లేదు.

శాంత తలుపు తట్టగానే గోపాలం పలికేడు. వెంటనే వచ్చి తలుపు తీశాడు.

"తలుపులు వేసివుంటే నిద్రపోతున్నారేమో అనుకున్నాను" అంది.

లోపలికి వచ్చి, వంట యింట్లోకి అడుగుపెట్టిన శాంత స్థాణువులా నిలబడి పోయింది. అక్కడపైప్ దగ్గర బకెట్‌తో బట్టలు తడిపి వున్నాయి. శాంత చీరకు గోపాలం సబ్బు పెడుతున్నట్టున్నాడు. మధ్యలో లేచివచ్చినట్లుగా సగం సబ్బు పెట్టిన చీర కనిపించింది

శాంత కళ్లు పెద్దవిచేసి ఆ చీరవైపు గోపాలంవైపు మార్చి మార్చి చూసింది.

గోపాలం నవ్వు తెచ్చిపెట్టుకుంటూ అన్నాడు.

"బట్టలన్నీ మాసివున్నాయి. నీకు ఒంట్లో బాగాలేదు. యింట్లో వూరికే కూర్చుని నేనేం చేస్తున్నాను-అందుకని-" గోపాలం మధ్యలోనే ఆగిపోయాడు. కారణం అప్పటికే శాంత కళ్ళనిండా గిఱ్ఱున నీళ్ళు తిరిగాయి.

"పాపిష్టిదాన్ని! మీరు వద్దంటున్నా వినకుండా వచ్చి - మిమ్మల్ని ఎంత బాధ పెడ్తున్నానండి!" అంది.

"అదేంమాట శాంతా! నా బట్టలు యిన్నిరోజుల నుంచీ నువ్వు వుతకటంలేదా? నీకు ఒంట్లో బాగా లేదని ఒక్కరోజున నేను ఆపనిచేస్తే తప్పా!"

"మీకు పుణ్యం వుంటుంది, అలాటి మాటలు అనకండి" శాంత ఏడవసాగింది.

శాంతని ఓదార్చేసరికి గోపాలం తలప్రాణం తోకకి వచ్చింది. శాంత ఏడుస్తుండగానే రాధ లోపలకి వచ్చింది. "అమ్మా ఎందుకే ఏడుస్తున్నావు?" అంటూ ఆరాలు మొదలుపెట్టింది.

ఆ ఆదివారం తహసిల్దారుగారి యింట్లో డిన్నర్ అయింది. అంతక్రితం రోజు ముందే శాంత స్వీట్స్ చేయాలని, ఉదయం వెళ్ళి రాత్రి 10 గంటలకి వచ్చింది. ఉదయం నుంచి పొయ్యి దగ్గర వుండటంలో ఏం తినబుద్ధి కాలేదని భోజనం చేయలేదు. ఈ కొద్దిరోజుల్లోనే శాంత చిక్కినట్టు స్పష్టంగా తెలుస్తోంది.

బలవంతంగా తనవెంట బైలుదేరి వచ్చినందుకు భర్తకి ఎలాటి యిబ్బంది కలగకూడదని శాంత పడుతున్న తాపత్రయం చూస్తే గోపాలం గుండెలు ద్రవిస్తున్నాయి. అక్కడికీ ఎన్నోసార్లు చెప్పాడు! శాంతా! ఎందుకంత బాధ పడతావు! నీ మెడలో నేను తాళికట్టినప్పుడు నా వెంటవుండే హక్కు నీకు లేదా! నిన్ను నాతో తీసుకురావడానికి నేను చేసిన ఘనకార్యం ఏమీ లేదు."

కానీ ఈమాటలేవీ శాంత తలకి ఎక్కేవికావు. అతని గుండెల్లో తలదాచుకుంటూ "ఏమోనండీ! ఆ హక్కులు-

అధికారాలు నాకు తెలియవు. నేను మీ మెడలో గుదిబండలా అయ్యానని మీరు అనుకుంటే చచ్చిపోయినట్టే లెఖ్క" అనేది.

గోపాలం ఆప్యాయంగా శాంత బుగ్గలు నిమిరేవాడు.

"కాదు శాంతా! నువ్వు సరిగ్గా ఆలోచిస్తే నేనే నీ మెడకు గుదిబండలా అయినట్టు తెలుసుకుంటావు."

"ఛి. ఛీ. నేను అలాఅనుకుంటానా! అసలు ఏ ఆడ పిల్లయినా భర్తని గుదిబండగా భావిస్తుందా ఎక్కడైనా?"

"ఏమో! నాలాటి అసమర్థుడైతే ఎందుకనుకో గూడదూ?"

"మాటి మాటికీ ఆ మాట అంటారేమిటి?" శాంత కోపంగా చూసింది.

"తప్పేముంది శాంతా! సాటి మనుష్యులంతా అనే మాట నేను అంటున్నాను." గోపాలం సీరియస్‌గా అన్నాడు.

ఆ విధంగా ఆ దారిద్ర్యంలోనే ఒకరికి ఒకరు ధైర్యం చెప్పుకుంటూ, సానుభూతి చూపించుకుంటూ ఇద్దరూ కొన్ని క్షణాలైనా ఆనందంగా గడుపుతూ ఆ తృప్తితో బ్రతకటానికి ప్రయత్నించసాగారు. కష్టాలు కలకాలం వుండవు! నవ్వీన నాపచేను పండక మానదు! ఎప్పటికైనా మనం కూడా అందరిలా బ్రతకక మానం అని శాంతకి దృఢమైన నమ్మకం. కానీ ఆ నమ్మకం గోపాలానికి లేదు. ఈ రోజుల్లో మనిషి మనిషిగా బ్రతకాలంటే ఏవేవి కావాలో అవి తనకెప్పటికీ దొరకవని గాఢ విశ్వాసం.

ఆదివారం ఉదయం శాంత తహసీల్దార్ గారి యింటికి వెళ్ళింది.

పిల్లలకు అన్నం తినిపించి గోపాలం కూర్చున్నాడు. రెండు మూడు రోజులనుంచి అతని మనసులో మరీ తీవ్రమైన మథన మొదలైంది. ఈవిధంగా వుద్యోగాల కోసం చూస్తూ పోవడం కేవలం స్వాతివానకోసం చూసినట్టే వుంటుంది. ఏద యినా చేయాలి. యింకేదయినా సరే! కానీ ఇంకా ఏదీ అన్నదే అతను నిర్ణయించుకో లేకుండా వున్నాడు. టెయిల రింగ్ షాపు పెట్టడమా? లేక యింకెక్కడికైనా వెళ్ళిపోయి లాండ్రీ ఓపెన్ చేయటమా? యీ పస్తులు, యీ దారిద్ర్యం ముఖ్యంగా భార్య కష్టపడి తెస్తుంటే కూర్చుని తింటున్నాడు అనే ఆరోపణ వీటినుండి తప్పించుకోకపోతే ఊపిరాడనట్టుగా వుంది.

యిరుగూ, పొరుగూ అతను నడుస్తుంటే వెనకనుంచి గుసగుసలాడడం, ఎదురుగా వస్తుంటే చటుక్కున మాటలు ఆపివేయటం యివన్నీ అతన్ని కణకణలాడే నిప్పులమధ్య తోసి నట్టుగా వున్నాయి.

కిటికీ దగ్గర పరధ్యానంగా ఆలోచిస్తూ కూర్చున్న గోపాలం గుమ్మంవైపు "యీ యిల్లే తాతయ్యా!" అన్న రాధ కంఠస్వరం విని వులిక్కిపడ్డాడు.

అతని కళ్ళు గుమ్మంవైపు తిరిగేసరికి రాధ, రాధచేయి పట్టుకొని మామగారు లోపలికి వచ్చారు.

గోపాలం లేచి నిలబడ్డాడు. ఒక్క క్షణం అతనికి ఆయనతో ఎలా మాట్లాడాలో, ఎలా మర్యాద చేయాలో తోచలేదు.

ఆయన చేత్తో పుస్తకంతో కిటికీ దగ్గర కుర్చీలో కూర్చొని లేచిన అల్లుడిని ఒక్కసారి నఖశిఖ పర్యంతం చూశాడు.

ఆ చూపులకి చిత్రమైన శక్తి వుంది. గోపాలం ముడుచుకుపోయినట్టు అయ్యాడు.

"ఊ! అమ్మాయి ఎక్కడా?" అన్నాడు.

గోపాలం గతుక్కుమన్నాడు.

గోపాలం చెప్పటానికి తటపటాయిస్తున్న సమాధానం రాధ చెప్పేసింది.

"తాసిల్దారుగారింటికి వంట చేయటానికి వెళ్ళిందని చెప్పానుగా తాతయ్యా."

గోపాలం మామగారు తీక్షణంగా, అసహ్యంగా నిరసనగా అల్లుడివైపు చూశాడు.

"నువ్వు కూర్చో తాతయ్యా. నేను అమ్మని పిలుచుకు వస్తాను" అంది రాధ పరుగెత్తబోతూ.

"రాధా!" వురిమినట్టు పిల్చాడు గోపాలం.

రాధ ఆగిపోయింది. బిక్కమొహంతో తండ్రివైపు చూసింది.

"నోరు మూసుకొని అవతలికి వెళ్ళు" కసిరాడు.

మామగారు కల్పించుకున్నారు.

"ఊ! చిన్నపిల్ల మీదనా నీ ప్రతాపం అంతా. రాధా! వెళ్ళు. వెళ్ళి అమ్మని తీసుకురా."

రాధ వెళ్ళాలో మానాలో తెలియనట్టు ఆగిపోయింది.

యింతలో శాంతే సమస్యని తీర్చేస్తున్నట్టు లోపలకి వచ్చింది. లోవలికి అడుగుపెట్టిన శాంత తండ్రిని చూడగానే ఒక్క-క్షణం నిర్విణ్ణురాలయినట్టు ఆగిపోయింది.

తండ్రి కూతురు ఒక్కసారి ఒకళ్ళని ఒకళ్ళు చూసుకున్నారు. శాంత చేతిలో గిన్నెలున్నాయి.

తహసిల్దారుగారు గోపాలానికీ, శాంతకి ఒక పూట అన్నం ఇస్తారు. శాంత అక్కడ తినదు. ఇంటికి తీసుకువచ్చి అందులో కూరంతా పిల్లలకి తీసిపెట్టి ఏ పచ్చడో వేసుకుని తను తినేస్తుంది.

శాంత కళ్ళు రెపరెపలాడినాయి.

తండ్రి పక్కనుంచి వెళ్ళి గిన్నెలు లోపల పెట్టివచ్చింది.

"ఎప్పుడు వచ్చారు నాన్నా!" అంది అడగలేక అడుగుతూ. ఆయన ఆ మాట వినిపించుకోనట్టే అన్నాడు.

"ఊ! చివరికి నువ్వు చేస్తున్న నిర్వాకం యిదన్న మాట! యిలాటి పని చేయడానికి నీకు బుద్ధి ఎలా లేకపోయింది? చేయించటానికి నీ మొగుడికి సిగ్గెలా లేకపోయింది?" ఛర్రుమన్నట్టు అడిగాడాయన.

గోపాలం ముఖం ఎర్రబడింది.

శాంత భయంగా భర్తవైపు చూసింది.

ఆయన గొంతు చిన్నదేం కాదు. అందులో, ఒక ఆవరణలో పది కాపురాలు వున్న స్థలం అది.

"నా కడుపునబుట్టి యిలాటి అప్రతిష్టపు పని చేస్తావా? యీ మాత్రం దానికేనా యింట్లోంచి వచ్చేశావు? అల్లుడి వైపు తిరిగి అన్నాడు. "భేష్! యిందుకేనన్నమాట?

ఉద్యోగం దొరికిందని అబద్ధం ఆడి దాన్ని యింట్లోంచి తీసుకు వచ్చావు? ఈరోజు భార్యని వంటచేయడానికి పంపావు? రేపు పిల్లల్ని అడుక్కు- తింటానికి పంపుతావు? నీలాటి చేతకాని చవటకి భార్యాపిల్లలు అవటం వాళ్ళ ఖర్మ! నీలాటి దౌర్భాగుడికి పిల్లనివ్వడం నా రాత!" అంటూ శాంతవైపు తిరిగి "యిప్పటికి చేసిన యీ నిర్వాకం చాలు. నడు ఇంటికి" అన్నాడు.

రెండు రోజులక్రితం తహసిల్దార్‌గారి దూరపుబంధువు అయిన ఒకాయన వాళ్ళింటికి వచ్చి అక్కడ వంటచేస్తున్న శాంతని చూసి నిశ్చేష్టుడై వెంటనే వెళ్ళి ఆయనకి యీ వార్త వినిపించాడు. అప్పటినుంచి ఆయనకి ఒంటికి కారం రాసుకున్నట్టు అయింది; సరాసరి బైలుదేరి వచ్చాడు. గేటు బైట ఆడుకుంటున్న రాధ బైట నిలబడే తాతగారికి యింటి విషయాలన్నీ చెప్పేసింది.

యిటు ఏడుతరాలు, అటు ఏడుతరాలు పరువు ప్రతిష్ట లకి ప్రాణాలు అర్పించిన వంశం ఆయనది. ఫలానా వారి అమ్మాయి వంటలు చేసుకొని బ్రతుకుతోంది అని అందరూ చెప్పుకుంటున్నారని తెలియగానే ఆయనకి గంగవెఱ్ఱులు ఎత్తింది. ఆ కోపం, యీ కోపం అంతా అల్లుడిమీద విరు చుకుపడింది. అందుకే తన మనసులో అతనిపట్ల వున్న అస హ్యం బైట పెట్టడానికి ఆయన వెనుదీయలేదు. గోపాలాన్ని అనడానికి సమయానికి సరైన మాటలు చాలటంలేదు అనిపిం చింది యింకా.

శాంత కళ్ళనీళ్లు నిగ్రహించుకోటానికి విశ్వప్రయత్నం చేస్తోంది.

గోపాలం కంఠం పెగుల్తూ వున్నట్టుగా మాటలు వచ్చాయి. "శాంతా! విన్నావుగా! యిప్పటికైనా నీ దురదృష్టం తెలుసుకో! నువ్వు వెళ్ళటానికి నాకేం అభ్యంతరం లేదు. నాలాటి అప్రయోజకుడికి భార్యగా వుండి యీ బాధలు పడేకంటే, సమర్థుడైన మీనాన్నదగ్గర వుండటమే మంచిది."

శాంత క్రిందకిచూస్తూ నిలబడింది.

యింతలో బాబు కూడా బైటనుంచి వచ్చాడు. తాతగారిని చూడగానే చంక ఎక్కాడు.

శాంత తండ్రి మనమడిని ఎత్తుకుని, రాధ చెయ్యి పట్టుకుని కూతురివైపుచూస్తూ అన్నాడు. "బట్టలు సర్దుకో! నేను వెళ్ళి రిక్షా తీసుకువస్తాను. మీఅమ్మకి నీ యీ అదృష్టం తెలియదు. తెలిస్తే యీసరికి మంచం పట్టివుండేది. ఛీ! ఛీ! భ్రష్టుడు! నిన్ను పంపిస్తే యింకా బాధ్యత తెలిసివస్తుందని అపోహ పడ్డాను. హాయిగా నీచేత చాకిరీ చేయించి తింటూ కూర్చుంటాడని అనుకోలేదు." ఆయన అరుస్తూ బైటకి వెళ్ళాడు పిల్లలుకూడా ఆయనవెంటే వెళ్ళారు.

"ఊ! బట్టలు సర్దుకో!" అన్నాడు గోపాలం హెచ్చరిస్తున్నట్టుగా.

"నేను వెళ్ళను. ఇక్కడనుంచి నాకంఠంలో ప్రాణం వుండగా ఎక్కడకీ వెళ్ళను. వెళితే అందరి ఆడపిల్లల్లా భర్తతో

పాటు గౌరవంగానే వెళ్తాను. మీరే చెప్పారుగా! నా మెడలో మీరు తాళికట్టారు. కాబట్టి మీతో వుండేహక్కుందని. దయవుంచి నన్ను వెళ్ళమని అనకండి" ఎంతో కష్టంమీద ఈ మాటలు అన్న శాంత. ఆపైన ఏడుపును ఆపుకోలేనట్టు అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

గోపాలం చిత్తరువులా నిలబడ్డాడు!

శాంతకి తనపట్ల విరక్తి కలిగించాలంటే తను కఠినత్వం తెచ్చిపెట్టుకోవాలి! కనీసం అదికూడా చేయలేని తన బలహీనతకి తనమీద తనకే అసహ్యం వేసింది.

పది నిముషాల్లో ఆయన ఆటోరిక్షా తీసుకువచ్చాడు. శాంత రానని స్పష్టంగా చెప్పింది.

ఆయన మండిపడ్డాడు

"నీ ఖర్మ నువ్వు అనుభవించు పిల్లల్ని మాత్రం యీ నీచపు పనులు నేను చూడనివ్వను నువ్వొస్తే వాళ్ళకి కనీసం తల్లిఅయినా వుంటుంది. రానంటావా ఫో! ఆతల్లి కూడా లేదనుకుంటాను. పిల్లలు కావాలనుకుంటే రా!"

ఆయన పిల్లల్ని తీసుకుని వెళ్ళిపోయాడు.

చిత్రంగా పిల్లలుకూడా తాతగారితో వెళ్ళటానికి ఉబలాట పడ్డారు. యింటికి వెళ్ళిపోతున్నాం అంటే వాళ్ళకి సంతోషంగా అనిపించింది. గోపాలానికి వాళ్ళని కసిరి యివతలకి తీసుకువచ్చే ధైర్యం లేకపోయింది.

ఆరాత్రి శాంత-గోపాలం యిద్దరూ నిద్రపోలేదు.

శాంత మర్నాడు వంట చేయటానికి వెళ్ళింది. యిరుగూ-పొరుగూ రాత్రి జరిగిన గొడవ విన్నట్టున్నారు.

గోపాలం వెడుతుంటే కుతూహలంగా, ఆసక్తిగా చూడ నాగారు.

పక్కింటి వదినగారు, ఎదురింటి పిన్నిగారు. శాంతని పిల్లలు ఎక్కడికి వెళ్ళారని ఏం తెలియనట్లు అడిగారుట తండ్రి తీసుకు వెళ్లాడని శాంత చెప్పిందట!

రెండు రోజులు గడిచినాయి! తహసిల్దార్ గారి భార్య పుట్టింటికి వెళ్ళింది. ఉన్నది ఆయన ఒక్కడే! శాంతకి ఆట్టే పనికూడా లేదు. త్వరగానే యింటికి వచ్చేసేది. రెండురోజులు లేనిహుషారు తెచ్చి పెట్టుకున్నా శాంతకి పిల్లలులేనిలోటు బలవంతంగా భరిస్తున్నట్లు వాడిపోయిన ఆ ముఖమే చెబు తోంది.

అక్కడికీ గోపాలం అనునయంగా, శాంతని వెళ్లి పిల్లల్ని తీసుకురమ్మనమని, కనీసం చూసయినా రమ్మనమని చెప్పాడు. శాంత వినలేదు. 'ఊహు! మీకు వుద్యోగం దొరికితేగాని నేను ఆయింట్లో అడుగుపెట్టను. నాన్నకి కన్నబిడ్డ కష్టపడు తోందన్న బాధకంటే; ఆయన పరువుపోయిందన్న వ్యథే ఎక్కువగావుంది. మనం నిలుపుకోవాల్సింది బంధుత్వం కాదు. ఆయన పరువు."

గోపాలానికి అర్థమైంది!

శాంత తనకు ఉద్యోగం దొరికితేనే గాని యిక్కడ నుంచి వెళ్ళదు. అక్కడ పిల్లలు ఏం బెంగపడుతున్నారో! ఆరోజు సరదాపడి వెళ్ళారుకానీ ఆ తర్వాత తల్లికోసం మారాం చేయకుండా వుంటారా!

చేస్తేనేం ? తను - శాంత, పిల్లలు ఆ దరిద్రంలోనే ఒకరకమైన హాయిని, శాంతిని అనుభవించారు. రాక్షసుడిలా వచ్చిన మామగారు తన పరువుప్రతిష్టలు పేరుతో ఆ శాంతిని నాశనం చేశాడు.

ఆరోజు ఆయన రగిల్చిన అవమానపు అగ్ని గోపాలం గుండెల్లో యింకా మండుతూనేవుంది.

గోపాలం తలుపులు తెరిచివచ్చి యింట్లో కూర్చున్నాడు. ఆలోచనల్ల వేడి, సున్నపుఘాటు కలిసి అతని తలని పగలగొడ్తున్నాయన్నంత తీవ్రంగా నెప్పిని తెప్పించాయి. తల వంచుకుని కూర్చున్నాడతను. ఈరోజు శాంతకి జీతం వస్తుంది. రేపు వెళ్ళి పిల్లల్ని తీసుకురమ్మనమని చెప్పాలి. లేకపోతే తనే వెళ్తాడు. తన పిల్లలు దొంగలవనీ, అడుక్కుతిననీ, ఖూనీలు చేయనీ! తనదగ్గరే వుంటారు.

గోపాలానికి యీ మధ్య రెండు మూడు రోజులనుంచి ప్రతి చిన్న విషయానికి పూరికినే ఆవేశం పొంగులా వస్తోంది! ఎంత సహనంతో బలవంతాన అదిమిపెట్టినా ఆవేశం ఏకాస్త చిన్న కారణం దొరికినా దెబ్బతిన్న పాములా బుస్సున పైకి లేస్తోంది.

తల వంచుకుని, శాంత రాకకోసం ఎదురు చూస్తూ, ఆలోచిస్తున్న గోపాలం తలుపు చప్పుడవటంతో, తలెత్తి చూశాడు! శాంత గాలిదుమారంలా లోపలికి వచ్చి చటుక్కున తలుపులు వెనక మూసింది.

"శాంతా !" గోపాలం దిగ్గున లేచి నిలబడ్డాడు !

అతని కళ్ళు పత్తికాయల్లా అయినాయి.

కారణం శాంత చిగురుటాకులా కంపించిపోతోంది! జాకెట్ చిరిగివుంది. తల రేగివుంది! కళ్లు వేటగాడిని చూసిన లేడికూనలా బెదిరిపోతున్నాయి.

"ఏమండీ!" మంచంలో బిగుసుకుపోయిన కంఠంలా ఆర్తనాదంలా పిలిచింది."

గోపాలం ఒక్క అంగలో శాంత దగ్గరగా వచ్చాడు.

శాంత అతని గుండెల్లో యిమిడిపోయింది.

"ఏమిటిది శాంతా ఏమైంది?"

అప్పటికే అతని గుండెల్లో సప్తసముద్రాలు ఘోషిస్తున్నాయి. జరగకూడనిదేదో జరిగిందని అనిపిస్తోంది.

శాంత వెంటనే ఏం చెప్పలేకపోయింది. తీవ్రంగా భయపడి పోయినట్లు వెన్నెముక మాటి మాటికి జలదరించ సాగింది.

గోపాలం అరచేత్తో శాంత వెన్నుమీద రాచాడు.

కొద్దిసేపటి తర్వాత భయం కాస్త తగ్గగా, శాంత చెప్పలేక చెప్పింది.

"ఏమండీ! ఆయనేనండీ! తహసిల్దారు. తండ్రిలాంటి వాడు అనుకున్నా. అంత పెద్దవాడి మనసులో యింత దుర్బుద్ధి వుంటుందనుకోలేదండీ. ఎప్పుడూ అమ్మా, తల్లీ అని పిల్చేవాడు. ఆయన భార్యవుండగా కన్నెత్తిచూసేవాడు కూడా గాదు! ఈరోజు-ఈరోజు సాయంత్రం భోజనానికి ఎవరోవస్తారని చెప్పివుండమంటే నిజమే అనుకున్నాను. తర్వా-తర్వా-తర్వాత-"

గోపాలం శాంతనోరు మూసేశాడు. "చాలు శాంతా! చాలు! యింకేం చెప్పకు" అన్నాడు. శాంత కొద్దిసేపయిన తర్వాత-ఏడుస్తూ అంది "యీ రోజు ఏం జరగకుండా యిలా బైటపడ్తాననుకోలేదు. నాకెంత భయంవేసిందని! ఏదయినా అయివుంటే-నేను బ్రతకగలిగేదాన్నా!"

శాంత శరీరం జలదరించింది.

కొద్దిసేపయిం తర్వాత గోపాలం శాంతని లేచి బట్టలు మార్చుకుని, జడ వేసుకోమని కోరాడు.

శాంత తిరిగి వచ్చేసరికి గోపాలం అక్కడలేడు.

గోపాలంలో చాలా రోజుల నుంచి బిగబట్టుకుంటున్న ఆవేశం, అభిమానం, రోషం, ఉద్రేకం ఒక్కసారిగా గొలుసులు తెంపుకున్నాయి. అతని మనసు క్రూరమృగాలు పరుగెత్తుతున్న అడివిలా అయింది. యుక్తాయుక్త విచక్షణజ్ఞానం నశించింది. శాంతమీద జరిగిన అత్యాచారం వినగానే అతని సహనం నామరూపాలు లేకుండా ఎగిరి పోయింది. దెబ్బతిన్న సింహం. దెబ్బకొట్టిన వాడిమీదకి వురుకుతున్నంత వేగంగా అతను తహసిల్దార్‌గారి యింటికి వెళ్లి తలుపు తట్టాడు.

ఆయన్ని గోపాలం ఎరుగును. దూరం నుంచి రెండు మూడుసార్లు చూసాడు.

ఆయనే వచ్చి తలుపు స్వయంగా తీశాడు! ఎదురుగా మాసినబట్టలతో పెరిగిన గడ్డంతో, చింతనిప్పుల్లా వున్న కళ్లతో నిలబడిన గోపాలాన్ని చూసి ఆయన ఎవరో పిచ్చి వాడు అనుకున్నాడు. ఆ తర్వాత అతను శాంత భర్త అని తెలుసుకున్నాడు.

తెలిసిన తర్వాత – భయపడలేదు, పిచ్చివాడయితే భయపడాలి మామూలు వాడయితె ఎందుకు;

'ఏమిటి' అన్నాడు నిర్లక్ష్యంగా.

గోపాలం సమాధానం చెప్పలేదు.

యింకొకసారి ఆయన రెట్టించబోయాడు.

యింతలో ఆయనచెంప చెల్లుమంది. ఒక్క క్షణం కళ్లముందు ఆ సమయం గిఱ్ఱున తిరిగినట్టయింది.

ఆయన తనని తాను సంబాళించుకునే లోపలే గోపాలం ఆకలిగొన్న క్రూరమృగంలా ఆయన మీద కలబడ్డాడు.

వయసు ఎక్కువేవున్నా, రోజూ వ్యాయామంతో మంచి ఆహారంతో శరీరాన్ని జాగ్రత్తగా, శ్రద్ధగా కాపాడుకునే ఆయన అవడంవల్ల, గోపాలం యువకుడైనా ఆ ధాటికి తట్టుకుని ఎదురు కలబడ్డాడు.

రెండు నిముషాలు యిద్దరికీ భయంకరమైన పెనుగులాట జరిగింది; యింతలో నౌకరు కుఱ్ఱాడు పరుగెత్తుకు వచ్చాడు. అతను కూడా ఆయనకి సాయం రావటంతో గోపాలాన్ని క్షణంలో ఆయన జయించి, తాడు తెమ్మని కాళ్లు, చేతులు, కట్టేశాడు.

ఆయన బుఱ్ఱ వేగంగా పనిచేసింది. ఎలాగైనా యీ గొడవ బైటికి రాకముందు. నలుగురిలో తన పరువుహానే ప్రమాదం వుంది.

అందుకే వెంటనే పోలీసులకి ఫోన్ చేశాడు. వాళ్ళు వచ్చేసరికి యినపెట్టె తెరిచివుంచాడు. కొన్ని నగలు చెల్లాచెదురు చేశాడు.

పోలీసులు రాగానే గోపాలాన్ని చూపిస్తూ యితను తమ యింట్లో వంట మనిషి భర్త అని, ఆ అమ్మాయి నమ్మించి భర్త ద్వారా యిలా ద్రోహం తలపెట్టిందని పాటి ఆడపిల్ల కష్టంలో వుందని, తను తన భార్యా సానుభూతిగా అడిగిన దానికంటే ఎక్కువే జీతం యిచ్చి చూసినందుకు యిది ప్రతి ఫలం అయిందని చెప్పాడు. గోపాలాన్ని ముందు నౌకరు చూసాడని, తర్వాత తనుకూడా చూసి పరుగెత్తుకు వచ్చానని యిద్దరూ కలిసి అతన్ని బంధించామని అన్నాడు. నౌకరు కూడా యజమాని చెప్పింది అక్షరాల నిజమని వత్తాసు పలికాడు.

గోపాలం అరెస్ట్ అయ్యాడు.

తహసిల్దారుగారు చెప్పిన మాటల వెనక అసలు సత్యం సమాధి చేయబడింది. అందరూ నిజమేనని నమ్మారు. అందుకే గోపాలం వుద్యోగం, సద్యోగం చేసుకోకుండా యిలా వూరికే వుంటున్నాడు కాబోలు అని నమ్మారు. శాంత ఆ యింట్లో కుత్సితమైన మనసుతో వంటకి చేరిందని, గోపాలం దొంగతనానికి వెళ్ళి పట్టుబడ్డాడనీ నిర్ధారణ అయిపోయింది. శాంత జరిగిన సంగతి చెప్పాలని చేసిన ప్రయత్నం అరణ్యరోదనే అయింది.

గోపాలం అరెస్ట్ అయాడన్నవార్త మామగారి పరువు ప్రతిష్టలకి మరీ దెబ్బ అయింది.

గోపాలానికి శిక్షపడింది. నలుగురూ ఏమైనా అనుకుంటారేమోనని శాంత తండ్రి లాయరుని పెట్టించాడు.

గోపాలానికి శిక్ష తప్పించాలని ఆయన చేసిన ప్రయత్నం వృథా అయింది. గోపాలం తన మీద అపాదించబడిన నేరం ఒప్పుకున్నాడు.

గోపాలం జైలుకి వెళ్ళేముందు పది నిముషాలు శాంతతో మాట్లాడాడు.

శాంత అతన్ని చూడగానే బావురుమంది.

"ఎందుకండీ యిలా అబద్దాలు ఆడారు."

గోపాలం మాట్లాడలేదు. శాంత అడిగిన దానికి సమాధానం చెప్పలేదు.

వెళ్ళేముందు అన్నాడు.

"శాంతా! నన్ను గురించి మర్చిపో! వెళ్ళేముందు మనస్ఫూర్తిగా చెబుతున్నాను! నేను జైలు నుండి విడుదల అయినా నీ దగ్గరకి తిరిగిరాను! పిల్లలకి నా గురించి చెప్పకు జీవితంలో ఓడిపోయిన మనిషిని నేను! నా మూలంగా నువ్వు-పిల్లలు బాధపడటం నాకిష్టంకాదు. నాకు కాకపోతే నీకు నాటివారిలో కనీసం సానుభూతయినా దొరుకుతుంది! నా మూలంగా యింతవరకూ నువ్వు సుఖపడిందేమీలేదు. యిక ముందు పడతావన్న ఆశకూడాలేదు. నన్ను మన్నించి మర్చిపో!"

శాంత కళ్ళు పెద్దవిచేసి, చిన్నపిల్లలా చూస్తూ గోపాలం మాటలు ఆశ్చర్యంగా వింది.

చివరికి తల అడ్డంగా తిప్పుతూ-దృఢంగా అంది.

"మీరు అలా అనకండి. మీరు చెప్పే మాటలు నాకు అర్థంగావు. మీరు తిరిగి వస్తారు! నేను ఎదురుచూస్తూ

వుంటాను! మీ మనసు మంచిది! అది నన్ను అన్యాయం చేయదు! బాధపెట్టదు! అన్ని రోజులూ ఒక్కలా వుండవు! భవిష్యత్ మీద నాకు నమ్మకంవుంది. మీరు ప్రపంచం గురించి మర్చిపోండి! నన్నూ, పిల్లల్నీ మాత్రమే గుర్తు పెట్టుకోండి!"

గోపాలం సమాధానం చెప్పలేదు. అక్కడి నుంచి కదిలి వెళ్ళి పోతుంటే చెవుల్లో శాంతమాటలు గింగురుమన సాగినాయి.

"మీరు తిరిగి వస్తారు! మీ మనసు మంచిది! అది నన్ను అన్యాయం చేయదు! ఎదురుచూస్తుంటాను మీ కోసం!"

జీవితం మీదకల యిచ్ఛని చంపేయాలని అతను చేస్తున్న వెర్రి ప్రయత్నాన్ని యీ మాటలు వచ్చి వెల్లువలా ముంచివేయ సాగినాయి.